


నేటిధాత్రి®

22nd ANNIVERSARY

తెలుగు వార్త పత్రిక

గురువారం 10-09-2026 పేజీలు : 08 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 22 సంచిక : 149 రూ।। 6.00




# బీఆర్‌ఎస్‌లో డప్పులు లేవా!



# అవి మొగయా!









## పదవుల కోసం ముంగట.. కొట్లాటకు ఎనక!

## బీఆర్ఎస్ దళిత నాయకుల వింత ధోరణి!

## బీఆర్ఎస్ లో దళిత నాయకులు లేరా?




- వాళ్లంతా ముందుకొచ్చి మాట్లాడరా! ప్రభుత్వం తో కొట్లాడరా!!
- బీఆర్ఎస్ మీద కాంగ్రెస్ అబండాలు వేస్తుంటే చూస్తూ ఊరుకుంటారా!
- కేసీఆర్ ఇంటి ముందు డప్పులు కొడుతుంటే ఏం చేస్తున్నారు?
- డప్పులు కొడతామని కాంగ్రెస్ ప్రకటించినా ఎందుకు స్పందించలేదు!
- ఒకరిద్దరు మాట్లాడితే సరిపోతుందా!
- బీఆర్ఎస్ లో దళిత నాయకులతో కలిసి ఇతర నాయకులు కలిసి రారా!
- జిల్లాల నాయకులు కదలరా!
- ఇప్పటికైనా ఏ రాష్ట్రం లో నైనా దళిత బంధు అమలు చేస్తున్నారా?
- కనీసం కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు అనుసరిస్తున్నాయా!
- తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం దళిత బంధు కొనసాగిస్తుందా!
- బీఆర్ఎస్ దళిత నాయకులు దీనిపై ప్రశ్నించరా?
- కేసీఆర్ ఇంటి ముందు డప్పు కొడుతుంటే చూస్తూ ఉండిపోతారా!
- దళిత నాయకులు కేసులు పెడతారేమో అని బయపడుతున్నారా!
- దళిత బంధు పొందిన వారిని ముందు పెట్టి కొట్లాడలేరా?
- ప్రస్తుత ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీ లు మాత్రమే కొట్లాడాలి!
- రేపటి రోజు టిక్కెట్లు కావాలని కోరుకోరా!
- గతంలో మంత్రులుగా పని చేసిన వాళ్ళు ఏమయ్యారు!
- బీఆర్ఎస్ లో ఎమ్మెల్యే లు అయిన దళిత నాయకులు ఎక్కడున్నారు!
- కేసీఆర్ చావును కోరుకుంటున్నామని కాంగ్రెస్ నాయకులు అంటుంటే వినపడం లేదా!
- దళితుల జీవితాలతో వెలుగులు నింపిన కేసీఆర్ ను నిందిస్తుంటే ఏం చేస్తున్నారు!
- కేసీఆర్ చావును కాంగ్రెస్ కోరుతున్నా కదలరా!

## •స్వతంత్ర భారతవని లో దళిత బంధు తెచ్చింది కేసీఆర్ కాదా!

## •80ఏళ్ల చరిత్ర లో కేసీఆర్ తప్ప ఏ పాలకుడైన కనీసం ఆలోచన చేశారా!

## •దళితుల కోసం కేసీఆర్ చేసిన సేవలో ఇతర ప్రభుత్వాలు పది శాతం చేశాయా!

హైదరాబాద్, నేటిధాత్రి:

బతికున్న వ్యక్తి ఇంటి ముందు చావు డప్పు మోగించడం హేయమైన చర్య. దుర్మార్గమైన చర్య. బతికున్న నాయకుడి ఇంటి ముందు చావు డప్పు మోగించడమేమైనా పిల్లలాటనా? సభ్య సమాజం తలదించుకునే చర్య. రాజకీయాలను అపహాస్యం చేసే చర్య. నాయకుడిని ఎదుర్కోలేక, రాజకీయంగా పై చేయి సాదించలేక చేసే అసర్ధమైన చర్య. పైగా కేసిఆర్ చావు కోరుకుంటున్నామని ఒక శాసన సభ్యుడు బహిరంగంగా వ్యాఖ్యానించడం సరైందేనా? నైతికతేనా? రాజకీయ విలువలకు తిలోదాకాలు ఇవ్వడం కాదా? అదికారంలో వున్నామని ఏది చేసిన చెల్లుతుందనే అహంకారం కాదా? ఎంతటి శత్రువైనా సరే చావాలని కోరుకోరుకోవద్దు. అనే నీతి సూత్రాలు తెలియని వాళ్లా? రాజకీయ ఆధిపత్యాలలో నాయకుల చావు కోరుకోవడం ఎంత మాత్రం మంచిదికాదు. రాజుల కాలంలోనే శత్రులను ఓడించడం అంటే చంపడమని కాదు. వారిపై విజయం సాదించడం. ఆ మాత్రం విషయ పరిజ్ఞానం, మానవతా దృక్పథం లేకుండానే రాజకీయాలు చేస్తున్నారా? ప్రజల చేత ఎన్నుకోబడి చట్ట సభల్లో కూర్చుంటున్నారా? ఇంతటి దుర్మార్గం ఎక్కడా చూడలేదు. వినలేదు. కాని తెలంగాణ కోసం 15సంవత్సరాలుపోరాటం చేసి రాష్ట్రాన్ని సాదించిన కేసిఆర్ తెలంగాణకు శని అని పాలకపక్ష నాయకులు మాట్లాడడం విడ్డూరం కాదా? ఏది చేసినా రాజకీయమే అని జనం అనుకోవాలా? కేసిఆర్ ఇంటి ముందు చావు డప్పు కొట్టడం ఏ రాజకీయం నేర్పిన పాఠం. ఇంతటి దుర్మార్గానికి ఒడిగడితే జనం చీ కొడతారన్న ఆలోచన కూడా లేదా? ఇదిలా వుంటే కేసిఆర్ ఇంటి ముందు చావు డప్పులు మోగిస్తామని సాక్ష్యాత్తు అసెంబ్లీలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రకటించినప్పుడు బిఆర్ఎస్ నాయకులకు వినపడలేదా? బిఆర్ఎస్‌లో దళిత నాయకులు లేరా? దళిత కార్యకర్తలు లేరా? పదవుల కోసం మాత్రం మేమున్నామని వస్తారు. కాని రాజకీయంగా పార్టీకి అండగా నిలబడానికి మాత్రం ఆమడ దూరంపోతారా? అసెంబ్లీలో బీర్ల అయిలయ్య ప్రకటించిన మరు నాడు ఉదయం నుంచే వేలాది మంది కార్యకర్తలు కేసిఆర్ ఫామ్ హౌజ్ చేరుకుంటున్నారన్న సంగతి బిఆర్ ఎస్ దళిత నాయకులకు కనిపించలేదా? ఇంత జరుగుతున్న బిఆర్ఎస్ దళిత నాయకులకు నోరులేదా? ముందుకొచ్చి మాట్లాడలేరా? కాంగ్రెస్ చేసిన పనిని ఎండగట్టలేరా? ఎంతసేప కేటిఆర్, హరీష్‌రావు, ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మాత్రమే మాట్లాడాలా? బిఆర్ఎస్ దళిత నాయకులు లేరా? చూస్తూ ఊరుకున్నారా? మాకెందుకు లే అనుకున్నారా? మీకు డప్పులు లేవా? ప్రభుత్వ చర్యకు నిరసనగా డప్పులు వాయించలేరా? ప్రతి పక్ష నాయకుడు కేసిఆర్ బతికుండగానే కాంగ్రెస్‌నాయకులు డప్పులు కొట్టగాలేనిది, పాలకపక్షం విఫలమైందని మోగింలేరా? తిరిగి నిరసన చేపట్టలేరా? దళితులందరినీ ఏకం చేయలేరా? బిఆర్ఎస్‌పార్టీలో చిన్నా చితక నాయకులు వేల మంది వున్నారు. కార్యకర్తలు లక్షల్లో వున్నారు. మీరంతా కదిలే ప్రభుత్వంలో వణుకు పుట్టదా? పార్టీ అధికారంలో వున్ననాడు పదువులు పొందలేదా? కేసిఆర్ దళిత బంధు అమలు చేస్తే ముందుగా పార్టీ నాయకులు పది లక్షలు పొందలేదా? కాంగ్రెస్ అదికారంలో వుండి కేవలం పదువులు ఇస్తేనే ఇంతగా స్పందించారు. కేసిఆర్‌ఇంటి ముట్టడికి వెళ్లారు. పదేళ్ల అదికార పార్టీలోవున్నారు. పదవులు, పరపతి పొందారు. నాయకులుగా గుర్తింపు పొందారు. దళిత బంధు అమలు చేస్తే పది లక్షలు కూడా పొందారు. ఇంతకన్నా గొప్పగా దళితులకు న్యాయం చేసిన పాలకులు ఎవరైనా వున్నారా? దేశ స్వాతంత్ర చరిత్రలోనే ఏ రాష్ట్రంలో ఇప్పటి వరకు ఏ పాలకుడు దళిత సమాజాన్ని ఆర్ధికంగా ముందుకు తీసుకెళ్లేందుకు దళిత బంధు లాంటి పథకం ఆలోచన కూడా చేయలేదు. దేశాన్ని 50 ఏళ్లపాటు పాలించిన కాంగ్రెస్ జాతీయ స్ధాయిలోగాని, అదికారంలోవున్నప్పుడు రాష్ట్రాలలో కూడా అమలు చేయాలని కలలో కూడా ఆలోచించలేదు. ఎంతసేపే ఎస్సీ సబ్ ప్లాన్ అని పేరు పెట్టి, అసలు ఏ దళితులను ఆర్ధికంగా పైకి తీసుకొచ్చారో అనేది ఎవరూ చెప్పలేరు. ఎస్సీ సబ్ ప్లాన్ అమలుతో ఎంత మంది దళితులు లక్షాది కారులయ్యారో ఎవరూ నిరూపించలేరు. కాని కేసిఆర్ ప్రపంచ చరిత్రలోనే దళితుల కోసం ఆలోచన చేసిన ఏకైక నాయకుడు. దళిత బంధు అనే పథకాన్ని తీసుకొచ్చిన ఏకైకపాలకుడు. దళిత సమాజం ఆర్ధికంగా నిలదొక్కుకోవాలని కోరుకున్న ఏకైక నాయకుడు కేసిఆర్. అందుకు ప్రతి దళితుడికి రూ.10లక్షలు అందజేసే దళిత బంధు తెచ్చారు. దళితులు సమజంలో సమాజిక అసమానతలు, ఆర్ధిక అసమానతలు ఎరుర్కొనేందుకు దారి చూపారు. అలాంటి చేసిఆర్‌కు దళితులెవ్వరూ వ్యతిరేకం కాదు. కాని కాంగ్రెస్‌పిలుపుతో డప్పులు కొట్టిన వాళ్లు కూడా ఆత్మను చంపుకొనే వుంటారు. ఇంత జరిగి రెండు రోజులౌతున్నా బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన వాళ్లు ఎక్కడికిపోయారు. ఎమ్మెల్యేలుగా గెలిచిన మాజీలు ఎక్కడున్నారు. కనీసం మీరైనా ఐక్యత ప్రదర్శిం చలేకపోతున్నారా? జిల్లా స్ధాయిలో కూడా ఎంతోమంది నాయకులు లేరా? గతంలో పదేళ్ల కాలంలో ప్రభుత్వంలో పదువులు పొందిన వాళ్లు లేరా? గత ప్రభుత్వ హయాంలో కేసిఆర్ దళిత బంధు పథకాన్ని రూ.10లక్షలతో ప్రారంభిం చారు. తాము గెలిస్తే ప్రతి దళిత కుటుంబానికి

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

రూ.12లక్షలు ఇస్తామన్నారు. ఈ విషయమైనా బిఆర్ఎస్ దళిత నాయకులకు గుర్తుందా? గుర్తుంటే ఇంత కాలం ప్రశ్నించకుండా ఎందుకు వుంటున్నారు? స్పీకర్ గడ్డం ప్రసాద్‌రావును పదే పదే దళితుడు అని కాంగ్రెస్ నాయకులు పదే పదే సంబోదించడం సరైందేనా? దళిత నాయకులకు పదవులు ఏమైనా ఉదారంగా ఇస్తున్నారా? అని బిఆర్ఎస్ దళిత నాయకులు ప్రశ్నించలేరా? ఉన్నత స్ధానంలో కూర్చున్న దళిత నాయకుడు అంటూ పదే పదే కాంగ్రెస్ నాయకులు చెప్పడం సరైందేనా? అని ప్రశ్నించలేరా? ఎంత ఎత్తుకెదిగాని దళిత నాయకులను కులం ఆధారంగానే చూస్తారా? సంబోధిస్తారా? అని నిలదీయలేరా? దళిత వర్గాలతో కలిసి నిరసన తెలియజేయలేరా? ఏకంగా కేసిఆర్ చావును కోరుకుంటుంటే కూడా ఇతర నాయకులకు చీమ కుట్టినట్లు కూడా అనిపించడంలేదా? రానున్న ఎన్నికల్లో మాకే టికెట్లు కావాలని కోరుకునే నేతలు మౌనంగా వుండాల్సిన సమయమేనా? ఎమ్మెల్యే టి క్కెట్లు, ఎమ్మెల్సీ టిక్కెట్లు కావాలని కోరుకుంటున్న ఇతర వర్గాల నాయకులు కూడా కదలడానికి విచ్చన ఇబ్బందేముంది? పాలకపక్షాన్ని విమర్శించేందుకు ఎదురౌతున్న అవరోధమేమిటి? కేసులు ఎదుర్కొనాల్సివస్తుందని భయపడుతున్నారా? లేక మాకెందుకు లే ఆ గొడవ అని ఊరుకుంటున్నారా? ఒక్క పిలుపుతో కాంగ్రెస్ నాయకులంతా కేసిఆర్ ఫామ్‌హౌజ్ వైపు బాట పట్టారు. కనీసం బిఆర్ఎస్ నాయకులు, వాళ్ల వాళ్ల నియోకజవర్గాలు, నాయకులు వారి వారి జిల్లాలు,

## •కాంగ్రెస్ నాయకులంతా కదిలినా, బీఆర్ఎస్ నాయకులు మేలుకోరా!

మండలాలు, గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టలేరా? అందుకు కూడా రాష్ట్రపార్టీ నుంచి అనుమతులు వస్తే కదులుతామని అనుకుంటున్నారా? ఏది ఏమైనా రాజకీయాల్లో ఆత్మహత్యలే వుంటాయి అంటారు. కాని హత్యలుఉండవు అని గొప్పగా చెప్పుకుంటారు. మరి చావు డప్పులు మోగించడం ఏం రాజకీయమో రాజకీయ పార్టీలే చెప్పాలి. చైతన్యవంతమైన సమాజం ఇలాంటి వాటిని స్వాగతించకుండా వుండాలి.



# నేటిధాత్రి®
తెలుగు వార్త పత్రిక
22ND ANNIVERSARY

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

గురువారం 10-09-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 149 రూ॥ 6.00





## సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌పై మిల్లర్ల మితిమీరిన వ్యాఖ్యలు

# లీడర్లే డిఫాల్టర్లు.. ప్రభుత్వానికి

# దమ్కీ ఇస్తున్నారు?




చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888





## కమిషనర్ స్టీఫెన్ పై తప్పుడు ప్రచారం చేస్తున్న దొంగ మిల్లర్లు.

- మిల్లింగ్ ఆపేస్తామని బ్లాక్ మెయిల్ చేస్తున్నారు!
- కట్టుకథ లు చెప్పి తప్పించు కోవాలనుకుంటున్నారు?
- ప్రభుత్వాన్ని తప్పుతోవ పట్టించాలని చూస్తున్నారు!
- మీడియా సమావేశం లో పాల్గొన్న వాళ్లలో మెజారిటీ డిఫాల్ట్ మిలర్లే!
- ప్రభుత్వం మీద మిల్లర్లను ఉసిగొలిపిన ఆ ఉన్నతాధికారి ఎవరు?




- ఏ అధికారి అండ చూసుకొని మీడియా సమావేశంలో సీఎం రేవంత్ పై మిల్లర్లు చిందులు తొక్కారు.
- రాష్ట్ర స్థాయిలో మిల్లర్ల అసోసియేషన్ నాయకులే పెద్ద డిఫాల్టర్లు!
- ప్రభుత్వ పెద్దలకు సన్నిహితులు?
- అయినా ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేస్తున్న వాళ్లే!
- బకాయిలు ఎగ్గొట్టి తిరుగుతున్న వాళ్లే
- వేల కోట్లు బకాయిలు ఉన్నవాళ్లే?
- రెండు నెలల గడువు కోరి తప్పించుకుందామనుకుంటున్నవాళ్లే!
- పైగా టెండర్ ప్యాడి బకాయిలలో కీలకమైన వ్యక్తులే?

## చిన్న మిలర్లను చంపేయాలని చూస్తున్న వాళ్లే?

- చితికి పోయిన చిన్న మిలర్లను తొక్కేయాలని చూస్తున్న వాళ్లే?
- చిన్న మిల్లర్ల మీద అబండాలు మోపి తప్పించుకోవా లనుకుంటున్నవాళ్లే?

- మిల్లింగ్ చేయమని చెప్పడం కాదు, బకాయిలు చెల్లించాలి !
- ఫిజికల్ వెరిఫికేషన్ కు సహకరించాలి!
- ఫిజికల్ వెరిఫికేషన్ తప్పించుకునేందుకు మిలర్ల కొత్త నాటకం!
- నాణ్యమైన ధాన్యం రావడం లేదన్నది పచ్చి అబద్ధం!
- హైబ్రిడ్ పంటలలో నాణ్యత లేదనడం దుర్మార్గం.
- రైతు కష్టం దోచుకోవడం, ప్రభుత్వాన్ని మోసం చేయడం!
- రైతులనుంచి బస్తాకు 6 నుంచి 7 కిలోలు అదనంగా మిలర్లు తీసుకుంటున్నారనేది పచ్చి నిజం.
- మిల్లుల్లో ధాన్యం ఉందని చెబుతున్నది మిలర్లే!
- ఫిజికల్ వెరిఫికేషన్ చేయొద్దని డిమాండ్ చేస్తున్నది మిలర్లే!
- మిలర్ల డబుల్ గేమ్ లో ఏది నిజమో మిలర్లే చెప్పాలి.
- ప్రభుత్వాన్ని బెదిరించే స్థాయికి చేరుకున్నారు.
- వేల కోట్లు మింగారు..సుద్దపూస ముచ్చట్లు చెబుతున్నారు.

హైదరాబాద్, నేటిధాత్రి:

మెచ్చుకొని మెడల మీద వేసుకుంటే జారి జబ్బల మీద పడ్డారని ఓ సామెత. సరిగ్గా తెలంగాణలోని కొంత మంది బడా రైస్‌మిల్లర్ల పరిస్థితి అలాగే వుందని అంటున్నారు. పేరు పెద్దపెద్ద మిల్లర్లు వాళ్లు. తెలంగాణలో చిన్న చిన్న మిల్లర్లంతా కలిసినా లేనంత బకాయిలు ఆ మిల్లర్ల వద్దనే వున్నాయనేది ఓవాదన. అలాంటి మిల్లర్లు ఇప్పుడుఏకంగా ప్రభుత్వాన్నే ప్రశ్నించే స్థాయికి చేరుకున్నారు. ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేసే పరిస్థితి వచ్చారు. ప్రభుత్వం తమకు ఎలాంటి ఇబ్బంది కల్గించినా సరే ఈసారి మిల్లింగ్ ఆపేస్తామని ఏకంగా దమ్కీ ఇచ్చే దశకు చేరుకున్నారు. తాజాగా కొంత మంది డిఫాల్టు మిల్లర్లు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ ప్రభుత్వానికి హెచ్చరికలు జారీచేశారు. ఓ వైపు రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు సాగుతున్న వేళ తాము కూడా ప్రభుత్వానికి వ్యతిరేకం అనే సంకేతాలు పంపితే ప్రభుత్వం వెనుకడుగు వేస్తుంది అనుకున్నట్లున్నారు. అసెంబ్లీ సమావేశాలు సాగుతున్న సమయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వం తమను వేదిస్తోందన్న మాటలు చెబితే ప్రతిపక్షాలకు అస్త్రం అందించినట్లౌతుందని ఓ ఉన్నతాధికారి బకాయి బడా మిల్లర్లకు ఉచిత సలహా ఇచ్చినట్లు కూడా సమాచారం. దాంతో మీడియా సమావేశం తర్వాత కొంత అదే మిల్లర్లు ఆఫ్‌ద రికార్డు పేరుతో మీడియా ప్రతినిధులో మరోసారి చిట్ చాట్ నిర్వహించినట్లు కూడా తెలుస్తోంది. అందులో ఏకంగా సిఎం. రేవంత్‌రెడ్డి మీద నోరు పారేసుకున్నట్లు కూడా చెబుతున్నారు. సిఎం. రేవంత్ రెడ్డి మీద ఇష్టాను సారం మాట్లాడినట్లు కూడా తెలుస్తోంది. అంటే పదేళ్ల కాలంగా ప్రభుత్వం కళ్లు గప్పి బడామిల్లర్లంతా కలిసి వేల కోట్లు మింగారు. అంతే కాదు ఇందులోనే కొంత మంది ప్యాడీ టెంటర్లలో కూడా వున్న మిల్లర్లు వున్నారు. అటు ప్యాడీ టెండర్లలోనే వేల కోట్లు బకాయిలు వుండగా, ఈ మధ్య కాలంలో కూడా వందల కోట్లు బకాయిలు పడ్డారు. అయితే మిల్లర్ల అక్రమాల మీద, చేస్తున్న అరాచకాల మీద, నేటిధాత్రి గత పది సంవత్సరాలుగా అనేక వార్తా కథనాలు ఎప్పటికిప్పుడు రాస్తూ వస్తోంది. ఒకప్పుడు చిన్నాచితకా మిల్లులు నడుపుకునే కొంత మంది మిల్లర్లు తెలంగాణ పంటలు విస్తృతంగా పండడంతో వారి మిల్లులను మరింత పెంచుకున్నారు. బడా మిల్లర్లుగా మారిపోయారు. లక్షల పట్లు పండిస్తున్న రైతులు మాత్రం అక్కడే వున్నారు. రైతు కష్టం తెలియని మిల్లర్లు మాత్రం వందల కోట్లు సంపాదించున్నారు. ప్రభుత్వానికి వేల కోట్లు బకాయి పడ్డారు. అలా పదేళ్లుగా బకాయిలు చెల్లించకుండా పోవడంతో అవి కొండలా పేరుకుపోయాయి. వసూలుకు గుడి బండగా మారాయి. ప్రతిసారి మిల్లర్లు ఏదో ఒక సాకు చెప్పుకుంటూ బకాయిలు చెల్లించకుండా తప్పించుకుంటున్నారు. ప్రభుత్వాలు కూడా చూసి చూడనట్లు వసూలు చేస్తున్నారు. మిల్లర్ల గొంతెమ్మ కొరికలను గౌరవిస్తూనే వున్నారు. బకాయిలు వసూలు చేసే సమయంలో మిల్లర్లు ఎంత చెల్లిస్తే అంత తీసుకుంటూ ఉదారంగా ప్రభుత్వం వ్యహరిస్తూ పోయింది. అదే అలవాటైన మిల్లర్లు చెల్లించేది పావలా, బాకాయి పెట్టేది బారాణ అన్నట్లు సాగింది. కొంత మంది బడా మిల్లర్లు ఏకంగా వేల కోట్లు వెనకేసుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వం బకాయిలు వసూలు చేయాలని ప్రయత్నిస్తుంటే మిల్లర్లు గింజుకుంటున్నారు. లబోదిబో మంటున్నారు. ఎక్కడలేని బాధలు వెల్లగక్కుకుంటున్నారు. కట్టు కథలన్నీ చెబుతున్నారు. ఏకంగా ప్రభుత్వాన్నే తప్పుతోవ పట్టించే ప్రయత్నం ఎంతో చాకచక్యంగా అమలు చేస్తున్నారు. హైదరాబాద్ కేంద్రంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసిన వాళ్లలో రాష్ట్ర స్థాయి మిల్లర్ల అసోసియేషన్ నాయకులే కావడం విషేశం. పైగా ఈ మిల్లర్లలో ప్రభుత్వ పెద్దలకు సన్నిహితులుగా వున్న వాళ్లే కావడం మరింత విచిత్రం. అలాంటి మిల్లర్లే ప్రభుత్వానికి వ్యతిరేకంగా హెచ్చరికలు జారీ చేశారు. మిల్లింగ్ ఆపేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. వీళ్లంతా బకాయిలు ఎగ్గొట్టి తిరుతున్న వాళ్లే కావడం గమనార్హం. ఓ వైపు తమ వద్ద 78లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వుందని చెబుతున్నారు. మరో వైపు ఫిజికల్ వెరిఫికేషన్ చేయొద్దని డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి డిమాండ్లు గతంలో ఎవరూ చేయలేదు. చేసినట్లు దాఖలాలు కూడా లేవు. ఈ మిల్లర్ల డిమాండ్ విచిత్రంగా వుంది. ఇదిలా వుంటే వేల కోట్లు బకాయిలు వున్న ఈ మిల్లర్లే చిన్న చిన్న మిల్లర్ల మీద నిందలు మోపి వాళ్లకు దిక్కులేకుండా చేస్తారనే అపవాదు కూడా వుంది. ఏకంగా చిన్న మిల్లర్లను తొక్కేయాలని కూడా చూస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే చితికిపోయిన చిన్న మిల్లర్లను మరింత పాతాళానికి తొక్కాలని చూస్తున్నట్లు కూడా ఈ బడా మిల్లర్లే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఓవైపు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. మరో వైపు చిన్న మిల్లర్లను తొక్కేస్తున్నారు. మిల్లుల సామ్రాజ్యం ఏర్పాటు చేసుకొని గుత్తాధిత్యం చేయాలనుకుంటున్నారు. మిల్లర్ల వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తున్నారు. దాంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా వుంటుందనే ఎత్తుగడలు వేస్తున్నారు. ఇప్పటికే చిన్న మిల్లర్లకు, బకాయిదారులైన పెద్ద మిల్లర్లకు ఇప్పటికే ఎంతో అగాధం వుంది. చిన్న మిల్లర్లలో చాలా మంది ప్రభుత్వానికి ఎలాంటి బకాయిలు లేరు. వాళ్లంతా నిజాయితీగా తమ వ్యాపారం చేసుకుంటున్నారు. మీడియా సమావేశం ఏర్పాటు చేసిన బడా మిల్లర్లు చేసిన ఓ డిమాండ్ మరీ వచిత్రంగా వుంది. ఐదేళ్లుగా మిల్లర్‌గా వున్న వాళ్ల జోలికి అదికారుల వెళ్లొద్దు. ఫిజికల్ వెరిపికేషన్ చేయొద్దని డిమాండ్ చేస్తున్నారు. కొత్తగా మిల్లర్లను ఏర్పాటు చేసిన వాళ్లే ప్రభుత్వాన్ని మంచేసి వెళ్లిపోతున్నారని కొత్త కథ అల్లుతున్నారు. ఏ వ్యాపారమైనా కొంత కాలం చాలా నిజాయితీగా చేయాలనే ఏ వ్యాపారి అయినా కోరుకుంటాడు. గుర్తింపు తెచ్చుకోవాలని ఆరాట పడుతుంటారు. నమ్మకమైన వ్యాపారం చేయడానికే ఇష్టపడతారు. వ్యాపారంలో ఆరితేరిన తర్వాతే ఏ వ్యాపారి అయినా మోసాలకు పాల్పడుతుంటారు. కాని దశాబ్దాలుగా మిల్లర్లు నడుపుతూ వేల కోట్లు బాకాయిలు వున్న బడా మిల్లర్లు సుద్దపూసలట. కొత్తగా వ్యాపారంలోకి వచ్చిన వాళ్లే మోసాలు చేసి వెళ్లిపోతున్నారట. సహజంగా వ్యాపారం అచ్చి రాకపోతే ఆ వ్యాపారాన్ని వదిలేస్తారు. లేదా మానుకుంటారు. అంతే గాని లాభ సాటి వ్యాపారాన్ని ఎవరూ వదిలేసుకోవాలని అనుకోరు. నిలదొక్కుకునే ప్రయత్నమే చేస్తుంటారు. ఇలా తమ తప్పులను కప్పిపుచ్చుకునే క్రమంలో బడా మిల్లర్లు సాగిస్తున్న విన్యాసం ప్రభుత్వం కూడా గమనిస్తోంది. బడా మిల్లర్లు చేస్తున్న మరో విచిత్రమైన వాదన విపరీతంగా వుంది. రైతులు పండిస్తున్న ధాన్యంలో ఎక్కువగా నాసిరకం పంట దిగుబడిగా వస్తుందని అంటున్నారు. అసలు హైబ్రీడ్ పంటలంటేనే ఎక్కువ దిగుబడి. ఎక్కువ నాణ్యత. అనేది చిన్న పిల్లలను అడిగినా చెబుతారు. కాని కొంత మంది మిల్లర్లు మాత్రం హైబ్రీడ్ ధాన్యంలోఎక్కువగా నాసిరకం వస్తుందని సెలవిస్తున్నారు. దాంతో తాము నష్టపోతున్నామని అంటున్నారు. పంటలో నాణ్యత లేకపోవడం వల్ల మిల్లర్లు నష్టపోవడం అంటే ఏమిటో కూడా మరీ దుర్మార్గంగా వుంది. ఓ వైపు రైతులనుంచి బస్తాకు 6 నుంచి 7 కిలోలు అదనంగా తీసుకుంటున్నారన్నది జగమెరిగిన సత్యం. ఇన్ని రకాలుగా లబ్ధిపొందుతూ మిల్లర్లే గాయిగాయి చేయడాన్ని ఎవరూ సహించడం లేదు. పైగా మిల్లర్లు డబుల్ గేమ్ ఆడుతున్నారు. ఓ వైపు ధాన్యం వుందంటున్నారు? మరో వైపు ఫిజికల్ వెరిపికేషన్ వద్దంటున్నారు. పైగా ప్రభుత్వాన్ని శాసించే స్థాయికి చేరుకున్నారు. కోట్లు మింగి సుద్దపూసలమని చెబుతున్నారు. బడా బకాయి మిల్లర్లపై మీ నేటిధాత్రిలో త్వరలో వరుస కథనాలు..ఏ ఏ మిల్లర్ ఎంత బకాయి వున్నారు? వారి వద్ద వున్న స్టాక్ ఎంత? వంటి సమగ్ర వివరాలతో కూడిన సంచనల వార్తా కథనాలు త్వరలో…



22nd ANNIVERSARY

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక



గురువారం 10-09-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 149 రూ॥ 6.00




# ఫాంహౌస్ కుట్రపై సమగ్ర విచారణ

## కేసీఆర్ కుట్ర పన్నారు.. సభను అడ్డుకునే ప్రయత్నం

- 6న ఫాంహౌస్‌లో కుట్ర.. 7న స్పీకర్‌పై మాటల దాడి.. 8న శుద్ధి కార్యక్రమం
- విచారణ అధికారిగా ఐపీఎస్ విజయ్‌కుమార్
- కుట్ర చేసిన వారితో పాటు అమలు చేసిన వారిపైనా చర్యలు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నేటిధాత్రి:
ఫాంహౌస్‌లో కుట్రకు ప్రణాళికలు రూపొందించి అసెంబ్లీ సమావేశాలను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ సభ్యులు ప్రయత్నించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మూడు రోజులుగా జరిగిన ఘటనలకు ఫాంహౌస్ వేదికగా కుట్ర జరిగిందని పేర్కొన్నారు. అసెంబ్లీలో బుధవారం పలు అంశాలపై మాట్లాడిన సీఎం.. ఈ ఘటనలపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలిపారు.
ఈ విచారణకు ఐపీఎస్ అధికారి విజయ్‌కుమార్‌ను నియమించినట్లు వెల్లడించారు. దళితులను ఉద్దేశపూర్వకంగా అవమానించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, విద్వేషాలు, అల్లర్లు రెచ్చగొట్టడం నేరమని హెచ్చరించారు. దళితులపై అణచివేత, దురాగతాలకు పాల్పడిన వారిని చట్టపరంగా శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కుట్ర చేసిన వారితో పాటు దానిని అమలు చేసిన వారినీ కోర్టులో నిలబెట్టి శిక్షించాలని నిర్ణయించామని తెలిపారు.

### 6న కుట్ర.. 7న దాడి.. 8న శుద్ధి

ఈ నెల 6న ఎర్రవల్లి ఫాంహౌస్‌లో కుట్ర జరిగిందని సీఎం ఆరోపించారు. 7న స్పీకర్‌పై మాటల దాడి జరిగిందని, 8న శుద్ధి కార్యక్రమం చేపట్టారని పేర్కొన్నారు. ఈ ఘటనల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న వారితో పాటు కుట్రకు పాల్పడిన అందరిపైనా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. 'కోర్టు బెయిల్ ఇవ్వొచ్చేమో.. కానీ సమాజం మాత్రం బెయిల్ ఇవ్వదు' అని సీఎం వ్యాఖ్యానించారు.

### అసెంబ్లీని అడ్డుకునేందుకే కుట్ర

ప్రజా సమస్యలపై చర్చించేందుకే అసెంబ్లీ సమావేశాలను ఏర్పాటు చేశామని రేవంత్‌రెడ్డి తెలిపారు. 22ఏ భూములు సహా అన్ని అంశాలపై చర్చించాలనుకున్నామని చెప్పారు. ఆయా అంశాలపై చర్చ జరిగితే బీఆర్ఎస్‌కు రాజకీయ సమాధి తప్పదనే భయంతోనే అసెంబ్లీ సమావేశాలను అడ్డుకునేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు.
సమావేశాలకు ముందురోజు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఎర్రవల్లి ఫాంహౌస్‌కు పిలిపించుకుని కుట్రకు ప్రణాళిక రచించారని సీఎం ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాలు సజావుగా జరగకుండా చేయడమే వారి లక్ష్యమని విమర్శించారు.

### ఉత్తరాఖండ్ ఘటనను ఖండించాం.. ఇక్కడా అదే జరిగింది

ఉత్తరాఖండ్‌లో గతంలో జరిగిన ఘటనను ఖండిస్తూ రాష్ట్రపతికి కాంగ్రెస్ ఫిర్యాదు చేసిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. దురదృష్టవశాత్తు అలాంటి ఘటన తెలంగాణలోనే జరిగిందన్నారు. అసెంబ్లీ ఎదుట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై కొంతమంది దాడి చేశారని, స్పీకర్‌తో పాటు ఆయన తల్లిని అవమానించేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు.
బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలను సమాజమంతా ఖండించిందని అన్నారు. ఫాంహౌస్‌లో పన్నిన కుట్రలకు వ్యతిరేకంగానే దళితులు అక్కడ నిరసనకు వెళ్లారని, దాడులు చేయడానికి కాదని స్పష్టం చేశారు. ప్రజాస్వామిక పద్ధతిలో డప్పు కొట్టి దండోరా వేయడం ద్వారా తమ మనోభావాలను వ్యక్తం చేశారని సీఎం తెలిపారు.

### కాంగ్రెస్‌పై ప్రజలకు నమ్మకం

కాంగ్రెస్ అంటే ప్రజలకు నమ్మకం, విశ్వాసమని రేవంత్‌రెడ్డి అన్నారు. గొప్ప లక్ష్యంతో ఆవిర్భవించిన కాంగ్రెస్ దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిందని పేర్కొన్నారు. అణచివేత, వివక్షకు గురైన వర్గాల అభివృద్ధి కోసం రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు.
పాకిస్థాన్, బంగ్లాదేశ్ సంక్షోభాల సమయంలో దేశాన్ని నిలబెట్టింది కాంగ్రెస్‌నేనని, బ్రిటిష్ పాలకుల దోపిడీ, దుర్మార్గాలకు వ్యతిరేకంగా పోరాడిందని చెప్పారు. భారత రాజ్యాంగం దేశాన్ని ప్రపంచ దేశాల ముందు గర్వంగా నిలబెట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



# ప్రజా సమస్యలపై సస్పెన్షనా?



- అసెంబ్లీలో గొంతు నొక్కుతున్నారు.. ప్రజాక్షేత్రంలో అణచలేరు
- మైకులు కట్‌చేసినా.. సస్పెండ్ చేసినా ప్రజల తరఫున పోరాటం ఆగదు
- గవర్నర్‌కు ఫిర్యాదు.. న్యాయం జరగకపోతే జాతీయ మానవ హక్కుల, మహిళా కమిషన్లకు వెళ్తాం : కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు

హైదరాబాద్, నేటిధాత్రి:
అసెంబ్లీ సమావేశాలు ప్రతిపక్షాన్ని టార్గెట్ చేయడానికి కాదని, ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారాలు చూపేందుకేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మూడు రోజులుగా జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఒక్క సమస్యపైనైనా చర్చ జరిగిందా? ప్రభుత్వ విధానాలపై సమాధానం చెప్పారా? అని ప్రశ్నించారు. ప్రతిపక్షాన్ని వేధించడం, గొంతు నొక్కడం, సభ నుంచి బయటకు పంపడం తప్ప ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి పట్టింపు లేదని విమర్శించారు. ప్రజా సమస్యలు సభలో చర్చకు రాకుండా బీఆర్ఎస్ సభ్యులను బలవంతంగా బయటకు పంపడం అప్రజాస్వామికమని అన్నారు.

### ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే.. సస్పెన్షన్

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు, భూ యజమానులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, సింగరేణి కార్మికులు, వృద్ధులు తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఆర్టీసీ విలీనం ఎప్పుడు పూర్తవుతుందని ఉద్యోగులు అడుగుతున్నారని, నిషేధిత భూముల జాబితా నుంచి తమ భూములను ఎప్పుడు తొలగిస్తారని భూ యజమానులు ప్రశ్నిస్తున్నారని చెప్పారు. జీవో 97ను ఎప్పుడు రద్దు చేస్తారని పాలిటెక్నిక్ విద్యార్థులు, ఉద్యోగాల కోసం నిరుద్యోగులు, డీఏ--పీఆర్సీ కోసం ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.
ఈ సమస్యలన్నీ సభలో చర్చకు వస్తాయనే భయంతోనే ప్రభుత్వం ప్రతిపక్షాన్ని బయటకు పంపిందని ఆరోపించారు.

### 'ఇది ప్రతిపక్షంపై సస్పెన్షన్ కాదు'

'ఇది ప్రతిపక్షంపై విధించిన సస్పెన్షన్ కాదు.. ప్రజా సమస్యలపై విధించిన సస్పెన్షన్. తెలంగాణ ప్రజల గొంతుపై విధించిన సస్పెన్షన్' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో మైకులు కట్‌చేసినా, సస్పెన్షన్లు విధించినా ప్రజాక్షేత్రంలో తమ గొంతును అణచలేరన్నారు.
ఎంత అణచివేస్తే అంత బలంగా ప్రజల తరఫున బీఆర్ఎస్ పోరాడుతుందని చెప్పారు. నియంతృత్వంతో ప్రజాస్వామ్యాన్ని ఎక్కువ కాలం అణచలేరని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌పై చేసిన అవమానాలు, వ్యక్తిగత దూషణలు, రాజకీయ కక్ష సాధింపులను తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. ప్రజలే అంతిమ న్యాయమూర్తులని, తగిన సమయంలో ప్రజలే సమాధానం చెబుతారని అన్నారు.

### గవర్నర్‌కు ఫిర్యాదు

అసెంబ్లీ ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసులు వ్యవహరించిన తీరుపై గవర్నర్ శుక్లాకు ఫిర్యాదు చేసినట్లు కేటీఆర్ తెలిపారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపించారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై పురుష పోలీసులు దాడి చేసిన దృశ్యాలను గవర్నర్‌కు చూపించామని, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీర లాగిన ఘటనను వివరించామని చెప్పారు.
రైతులు, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలను కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్ విషయంలో నిబంధనలు పాటించలేదని ఆరోపించారు.

### న్యాయం జరగకపోతే ఢిల్లీకి

రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై గవర్నర్ స్పందిస్తారని ఆశిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. తమ ఫిర్యాదుపై సీఎస్, డీజీపీతో మాట్లాడి విచారణ చేయిస్తానని గవర్నర్ హామీ ఇచ్చారని చెప్పారు.
ఇక్కడ న్యాయం జరగకపోతే ఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై సమాధానం చెప్పే వరకు బీఆర్ఎస్ వెనక్కి తగ్గదని తేల్చిచెప్పారు.



# ప్రైవేట్ మెడికల్ మాఫియాపై మండలి గళం!



## వైద్యం...విద్య వ్యాపారాలుగా మారాయి

- పేద, మధ్యతరగతి ప్రజలను నిలువునా దోచుకుంటున్న ప్రైవేట్ ఆసుపత్రులు
- రెండు మాత్రలకు వేల రూపాయలా? : ఎమ్మెల్సీ విజయశాంతి ఆగ్రహం
- మెడికల్ మాఫియాపై చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆందోళన

హైదరాబాద్, నేటిధాత్రి:
ప్రైవేట్ ఆసుపత్రుల్లో పెరుగుతున్న దోపిడీ, వైద్య రంగంలో మాఫియా సంస్కృతిపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యం సేవా రంగం నుంచి పూర్తిస్థాయి వ్యాపారంగా మారిపోయిందని, పేదలు, మధ్యతరగతి ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రుల భారీ బిల్లులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

### లక్షల్లో బిల్లులు.. సామాన్యుడి విలవిల

ప్రైవేట్ ఆసుపత్రి మెట్లు ఎక్కితే చాలు లక్షల రూపాయల బిల్లులు వేస్తున్నారని విజయశాంతి మండిపడ్డారు. రెండు మాత్రలకు కూడా వేల రూపాయలు వసూలు చేసే పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యాన్ని వ్యాపారంగా మార్చి సామాన్య ప్రజలను దోచుకుంటున్న తీరుపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

### ఈహెచ్‌ఎస్ కార్డులున్నా వైద్యం అందని పరిస్థితి

ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్‌ఎస్) అమలుపైనా విజయశాంతి ప్రశ్నలు సంధించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య కార్డులు అనేక ప్రైవేట్ ఆసుపత్రుల్లో చెల్లడం లేదని, పాత బకాయిల పేరుతో రోగులను చేర్చుకోవడానికి నిరాకరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చెబుతున్నదానికి, క్షేత్రస్థాయిలో జరుగుతున్నదానికి పొంతన లేదని విమర్శించారు. ఈహెచ్‌ఎస్ అమలులో జాప్యం, నిర్లక్ష్యంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### మాఫియా సంస్కృతిపై గుత్తా ఆందోళన

ప్రైవేట్ వైద్య రంగంలో పెరుగుతున్న మాఫియా సంస్కృతిపై శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సైతం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రోగుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేయడం, వైద్యాన్ని వ్యాపార ధోరణితో నడపడం సరికాదన్నారు. సామాన్యులకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

### కఠిన నియంత్రణ అవసరం

వైద్యం, విద్యను వ్యాపార వస్తువులుగా మార్చే ధోరణికి అడ్డుకట్ట వేయాలని ఇద్దరు నేతలు స్పష్టం చేశారు. ప్రైవేట్ ఆసుపత్రుల అధిక ఫీజులు, అనవసర ఖర్చులు, ఆరోగ్య పథకాల అమలులోని సమస్యలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# స్టైఫండ్ డబుల్..

## ఆయుష్ విద్యార్థులకు గుడ్‌న్యూస్



- హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులకు భారీ పెంపు
- జీవో కాపీ అందజేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్, నేటిధాత్రి:
ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచురోపతి విభాగాల హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైఫండ్లను ప్రభుత్వం భారీగా పెంచింది. హౌస్ సర్జన్ల స్టైఫండ్‌ను రూ.13,754 నుంచి రూ.29,792కు, పీజీ విద్యార్థుల స్టైఫండ్‌ను రూ.34,385 నుంచి రూ.74,482కు పెంచుతూ జీవో జారీ చేసింది.
స్టైఫండ్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయుష్ విద్యార్థులు, వైద్యులు సచివాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పెంచిన స్టైఫండ్‌కు సంబంధించిన జీవో కాపీని మంత్రి వారికి అందజేశారు.
గత రెండున్నరేళ్లలో ఆయుష్ వైద్య వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 700 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లు, 138 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించామని పేర్కొన్నారు. ఆయుష్ వైద్యంపై పరిశోధనలకు యువ వైద్యులు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

# తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు ఫిలిప్పీన్స్ మంత్రి

- ప్రత్యేక ఆహ్వానం పలికిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- తెలంగాణ బియ్యం కొనుగోలుపై సానుకూల స్పందన



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
2026 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరుకావాలని ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్‌ను రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆహ్వానించారు. న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులను పెంచడం, వ్యవసాయ వాణిజ్య సంబంధాలను విస్తరించడం వంటి అంశాలపై చర్చించారు. తెలంగాణ బియ్యం పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఫిలిప్పీన్స్ ప్రతినిధి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి తెలిపారు. తెలంగాణ మాంస ఉత్పత్తులు, నాణ్యమైన విత్తనాల కొనుగోలుపైనా ఆసక్తి వ్యక్తమైందన్నారు. తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌తో అనుసంధానం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

# కేసీఆర్ చావు కోరడం సరికాదు

## నా వ్యాఖ్యల ఉద్దేశం అది కాదు: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



హైదరాబాద్, :
మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరణ ఇచ్చారు. ఒకరి చావు కోరడం ఏమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దళిత స్పీకర్, మహిళా మంత్రులను కులాల పేరుతో అసభ్యంగా దూషిస్తున్నారని మండిపడ్డారు.
ఈ నేపథ్యంలో ఆవేశంలో కేసీఆర్ వెంటనే అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలని కోరినట్లు తెలిపారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలదని, కేసీఆర్ కుటుంబానిది కాదని వ్యాఖ్యానించారు.
సీఎం, ఆయన కుటుంబ సభ్యులపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను ఎమ్మెల్యే తప్పుబట్టారు. మహిళలు టీవీల్లో ఆ వ్యాఖ్యలు వినలేక చెవులు మూసుకుంటున్నారని అన్నారు.
ఇటీవల కరీంనగర్‌లో కేటీఆర్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను ఈ సందర్భంగా మీడియాకు విడుదల చేశారు.

# మట్టి వినాయకుడినే పూజించాలి



హైదరాబాద్, నేటిధాత్రి:
పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక ప్రతిమలనే ఉపయోగించాలని సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి సూచించారు. సమాచార శాఖ ఉద్యోగులకు మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పండుగలను పర్యావరణహితంగా, బాధ్యతాయుతంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. జలవనరుల పరిరక్షణ, కాలుష్య నివారణకు మట్టి గణపతుల వినియోగం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు సంచాలకుడు డి.ఎస్. జగన్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కేసీఆర్ మరణాన్ని కాంగ్రెస్ కోరుకోలేదు

## కేసీఆర్ ఆరోగ్యంపై సీఎం రేవంత్ ప్రత్యేక శ్రద్ధ చూపారు: మహేశ్ గౌడ్



హైదరాబాద్, నేటిధాత్రి:
మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరణాన్ని కాంగ్రెస్ ఎప్పుడూ కోరుకోలేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కేసీఆర్‌కు చెడు జరగాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు పూజలు చేశారని కవిత స్వయంగా చెప్పారని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ఆరోగ్యం విషయంలో కాంగ్రెస్‌కు ఎలాంటి దురుద్దేశం లేదన్నారు. కేసీఆర్ బాత్‌రూమ్‌లో జారిపడినప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్ ఛానల్ ద్వారా వైద్యం అందించిన విషయాన్ని మర్చిపోయారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినప్పుడు ఆయన ఆరోగ్యం గురించి సీఎం స్వయంగా ఆరా తీశారని గుర్తుచేశారు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలని సీఎం రేవంత్‌రెడ్డి మాత్రమే కోరుకుంటున్నారని, ప్రతిపక్ష నేతను కాంగ్రెస్ గౌరవిస్తుందని మహేశ్ గౌడ్ తెలిపారు. కేసీఆర్ ఫాంహౌస్ వద్ద 55 మంది సిబ్బందితో ప్రభుత్వం భద్రత కల్పించిందని వెల్లడించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. సీఎం రేవంత్ రెడ్డికి అభిమానిగా ఉండటం వల్లే ఆ వ్యాఖ్యలు చేసి ఉండొచ్చని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తీరు దళిత సమాజాన్ని అవమానించే విధంగా ఉందని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు.

# యాప్‌ను రద్దు చేసే ప్రసక్తే లేదు

హైదరాబాద్, నేటిధాత్రి:
సబ్సిడీ ఎరువులు నిజమైన రైతులకు పారదర్శకంగా అందించేందుకే యాప్‌ను తీసుకొచ్చామని, దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ప్రసక్తే లేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రశ్నకు సమాధానంగా మాట్లాడిన మంత్రి.. యాప్‌లో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. స్మార్ట్‌ఫోన్లు లేని రైతుల కోసం కామన్ సర్వీస్ సెంటర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, డీలర్ల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని చెప్పారు. బ్లాక్‌మార్కెటింగ్, అక్రమ నిల్వలు, ఎరువుల దుర్వినియోగాన్ని అరికట్టడమే యాప్ ప్రధాన లక్ష్యమన్నారు. ఇప్పటికే 50 లక్షల మందికి పైగా రైతులు ఈ విధానం ద్వారా ఎరువులు కొనుగోలు చేశారని వెల్లడించారు. రాష్ట్రంలో యూరియా కొరత లేదని, కౌలు రైతులకు కూడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు పాటించాలి



▸▸నాగారం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి కాటంరాజు సూచన...

**పరకాల, నేటిధాత్రి:** నాగారం క్లస్టర్ పరిధిలో పత్తి పంట సాగు చేస్తున్న రైతులు ప్రస్తుత వర్షాల నేపథ్యంలో పంటలో తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి పీ.కాటంరాజు సూచించారు.పత్తి పంటలో కలుపు మొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు నివారించాలని రైతులకు సూచించారు.తొలిదశ నుంచే పంటను నిశితంగా పరిశీలిస్తూ తామర పురుగు,పచ్చదోమ,పిండి నల్లి,పెనుబంక వంటి రసం పీల్చే పురుగుల ఉధృతిని ముందుగానే గుర్తించాలన్నారు.ఈ పురుగుల ఉధృతి వల్ల పత్తి మొక్కల ఎదుగుదల మందగించడంతో పాటు ఆకులు ముడుచుకుపోవడం,పూత మరియు పిందె శాతం తగ్గడం వంటి సమస్యలు ఏర్పడి రైతులు నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు.రసం పీల్చే పురుగుల నివారణకు ఎకరానికి 300గ్రాముల ఎసిఫేట్ లేదా 40గ్రాముల అష్టమికు ఫ్రైడ్ మందును పిచికారీ చేయాలని సూచించారు.పంట పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ పురుగుల ఉధృతి కనిపించిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు.

## బాలాజీ పాఠశాలలో కాళోజీ నారాయణరావు జయంతి



**నర్సంపేట, నేటిధాత్రి:** ప్రజాకవి, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ -- నర్సంపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ రాజేంద్ర ప్రసాద్ రెడ్డి హాజరయ్యారు.కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం విద్యార్థులకు కాళోజీ జీవిత విశేషాలు, ఆయన సాహిత్య సేవలు, తెలంగాణ ప్రజల సమస్యలను తన రచనల ద్వారా సమాజానికి తెలియజేసిన విధానం గురించి వివరించారు.కాళోజీ రచనలు సామాజిక చైతన్యానికి, ప్రజాస్వామ్య విలువలకు ప్రతీక అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి గౌడ్,ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## వీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను నిర్మిస్తాం

▸▸ఎంసీపీఐ(యు) నర్సంపేట డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజసాహెబ్..



**దుగ్గొండి, నేటిధాత్రి:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను సెప్టెంబర్ 10 నుండి 17 వరకు నర్సంపేట డివిజన్ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు ఎంసీపీఐ(యు) నర్సంపేట డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజసాహెబ్ పిలుపునిచ్చారు. దుగ్గొండి మండలం గిర్నిబావిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన మహత్తర వీరోచిత ఘట్టమని కొనియాడారు. భూస్వాములు, జాగీర్దారులు, పటేల్, పట్వారీ వ్యవస్థల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సాగిన ఈ పోరాటంలో దొడ్డి కొమురయ్య, షేక్ బందగి వంటి వీరులు సహా సుమారు నాలుగు వేల మంది తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తుచేశారు.వారి అమరత్వ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపరుస్తూ ఉద్యమాలను నిర్మిస్తామన్నారు. ఈ వారోత్సవాల్లో డివిజన్‌లోని పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం




▸▸ఊరికి ఒకే గణపతిని ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజిద్దాం...

**మంచిర్యాల, నేటిధాత్రి:** వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పర్యావరణ ప్రేమికులు,సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని సూచిస్తున్నారు.గణేశ్ నవరాత్రుల అనంతరం విగ్రహాల నిమజ్జనం కారణంగా నీటి వనరులు కలుషితం కాకుండా ఉండేందుకు మట్టి విగ్రహాలను వినియోగించడం ఉత్తమమని పేర్కొంటున్నారు.అదేవిధంగా ప్రతి గ్రామం,కాలనీలో పెద్ద సంఖ్యలో గణపతి మండపాలను ఏర్పాటు చేయడం కంటే ఊరికి ఒకే గణపతిని ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో సామూహికంగా పూజలు నిర్వహించడం ద్వారా ఐక్యతతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు.భక్తి పేరుతో పర్యావరణానికి హాని కలగకుండా సంప్రదాయాలను కొనసాగించాలని,గణపతి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, పర్యావరణహితంగా నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. "మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం.. ఊరికి ఒకే గణపతిని నిలుపుకొని భక్తితో పూజిద్దాం" అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

▸▸రాజీ పడదగిన క్రిమినల్ కేసుల పరిష్కారానికి అవకాశం....

▸▸పరకాల సీఐ ప్రవీణ్ కుమార్...



**పరకాల, నేటిధాత్రి:** పరకాల,నడికూడ మండలాల పరిధిలోని ప్రజలు జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పరకాల సీఐ ప్రవీణ్ కుమార్ సూచించారు.సెప్టెంబర్ 7నుంచి 12వ తేదీ వరకు పరకాల కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పరకాల పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రిమినల్ కేసుల్లో ఇప్పటికే రాజీ కుదిరిన వారు,అలాగే రాజీ పడదగిన కేసుల్లో ఇరువర్గాలు పెద్దమనుషుల సమక్షంలో పరస్పర అంగీకారానికి రావాలని సీఐ సూచించారు.అనంతరం ఇరువర్గాలు పరకాల కోర్టులో హాజరై న్యాయపరమైన ప్రక్రియ ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.పరకాల,నడికూడ మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని రాజీ పడదగిన కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని కోరారు.కోర్టుకు హాజరయ్యే ఇరువర్గాల వారు తమ ఆధార్ కార్డులు,పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు.

## ఘనంగా కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు.



**చిట్యాల, నేటిధాత్రి:** చిట్యాల గ్రామపంచాయతీలో బుధవారం రోజున తెలంగాణ ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల కోసం చేసిన సేవలను, ఆయన సాహిత్య కృషిని స్మరించుకున్నారు. ప్రజల సమస్యలను తన రచనల ద్వారా ఎత్తిచూపిన కాళోజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్, వార్డు మెంబర్లు తౌటం నవీన్, మైదం శ్రావ్య శ్రీకాంత్, గ్రామపంచాయతీ కార్యదర్శి దేవేందర్ రెడ్డి, జీపీఓ రాజు ,అంగన్వాడీ టీచర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణ గర్వించదగ్గ మహనీయుడు కాళోజీ నారాయణరావు

▸▸పుర చైర్‌పర్సన్ డాక్టర్ గొడిసెల సంధ్యారాణి - రాజా రమేష్, కమిషనర్ మురళీకృష్ణ....



**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** తెలంగాణ వైతాళికుడు కాళోజీ నారాయణరావు అని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గొడిసెల సంధ్యారాణి – రాజా రమేష్, కమిషనర్ మురళీకృష్ణ అన్నారు.కాళోజీ జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమానికి, ప్రజా చైతన్యానికి కాళోజీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టుల దాతృత్వం.. ఏసీపీకి రూ. 5.30 లక్షల చెక్కు అందజేత

▸▸బాధ్యతను, నిజాయితీని చాటుకున్న నర్సంపేట విలేకరులు...

▸▸అభినందించిన ఏసీపీ పి. రవీందర్ రెడ్డి..



**నర్సంపేట, నేటిధాత్రి:** సమాజ హితానికి, వార్తా సేకరణకే పరిమితం కాకుండా తమ నిజాయితీతో నర్సంపేట జర్నలిస్టులు ఆదర్శంగా నిలిచారు. రూ. 5.3 లక్షల విలువగల చెక్కు దొరకగా, దాన్ని బాధ్యతాయుతంగా నర్సంపేట ఏసీపీ పి. రవీందర్ రెడ్డికి అందజేసి తమ ఉదారతను, నిజాయితీని చాటుకున్నారు. బుధవారం నర్సంపేట జర్నలిస్టులు మహాదేవుని జగదీష్ (99 టీవీ), గొడిశాల సదానందం (టీ న్యూస్), వడ్లకొండ రాజ్ కుమార్ (ఐ న్యూస్), ముత్తోజి కిరణ్ (సాక్షి), ఆగరపు స్వామి (రా6), సాంబమూర్తి (సిటీ కేబుల్), కందుల శ్రీనివాస్ గౌడ్ (నేటిధాత్రి), రాణా (ఎ5) తదితరులు కలిపి సదరు చెక్కును ఏసీపీ కార్యాలయంలో రవీందర్ రెడ్డికి అప్పగించారు. ఈ సందర్భంగా ఏసీపీ పి. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో దొరికిన సొత్తును తిరిగి అప్పగించడంలో జర్నలిస్టులు చూపిన నిజాయితీ అభినందనీయమని కొనియాడారు.వార్తలను అందించడమే కాకుండా సామాజిక బాధ్యతను కాపాడటంలో ముందంజలో ఉన్నారని ప్రశంసించారు. నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన జర్నలిస్టు బృందాన్ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

## తెలంగాణ గర్వించదగ్గ మహనీయుడు కాళోజీ నారాయణరావు

▸▸ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయాలి...

▸▸జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్...



**మంచిర్యాల, నేటిధాత్రి:** తెలంగాణ గర్వించదగ్గ మహనీయుడు,తెలంగాణ వైతాళికుడు కాళోజీ నారాయణరావు అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు తో కలిసి కలెక్టర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ప్రతి ఉద్యమానికి ప్రతిధ్వనిగా కాళోజీ నారాయణరావు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. తెలంగాణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడిగా కాళోజీని కొనియాడారు.తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమమే ఊపిరిగా జీవించిన ఆయన ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు.కాళోజీ జయంతిని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం సంతోషకరమన్నారు.విద్యార్థి దశలోనే నిజాం పాలనను ఎదిరించి,తెలంగాణలో విద్యా వ్యాప్తికి కృషి చేశారని గుర్తుచేశారు.తన రచనలు, కవితల ద్వారా ప్రజలను చైతన్యపరిచి,సామాజిక మార్పుకు మార్గదర్శకంగా నిలిచారని పేర్కొన్నారు.కాళోజీ నారాయణరావు బహుభాషా కోవిదుడని,కవిగా,రచయితగా తెలుగుతో పాటు వివిధ భాషల్లో రచనలు చేశారని తెలిపారు.మానవ హక్కులు, సామాజిక సమానత్వం,కుల వివక్ష లేని సమాజ నిర్మాణం వంటి అంశాలపై ఆయన రచనలు ప్రజలను ఆలోచింపజేశాయని అన్నారు.మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజల సంక్షేమం,రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతీరాం,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ,కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్ రావు దేశ్‌పాండే, వివిధ శాఖల జిల్లా అధికారులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టేకుమట్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సంకీర్త్



**భూపాలపల్లి, నేటిధాత్రి:** జిల్లాలో పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించే లక్ష్యంతో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, బుధవారం టేకుమట్ల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమైన ఎస్పీ శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు మరింత నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాలు టేకుమట్ల ఎస్సై అమూల్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# నిబద్ధతకు నిజాయితీకి క్రమశిక్షణకు నిలువెత్తు ప్రతిరూపం కరుణాకర్ ఐపీఎస్

▸▸ఒక వ్యక్తిత్వం... ఒక స్ఫూర్తి... ఒక స్థితప్రజ్ఞ ప్రయాణం....

▸▸కర్ణాకర్ ఐపీఎస్ అభినందన సభలో వక్తల అభినందన మాల....



**కమలాపూర్/ హనుమకొండ, నేటిధాత్రి:** హనుమకొండ జిల్లా కమలాపురం మండలంలోని ఉప్పల్ గ్రామానికి చెందిన పుల్ల కర్ణాకర్ 2010 సంవత్సరంలో గ్రూప్ వన్ ద్వారా పోలీస్ శాఖలో డిఎస్పీగా ఎంపికైనాడు. అంచలంచలుగా ఎదుగుతూ ప్రస్తుతం హైదరాబాదులో ఇంటలిజెన్స్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నాడు.ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఐపీఎస్ జాబితాలో చోటు సంపాదించారు.ఐపీఎస్ సాధించడం పట్ల కుటుంబ సభ్యులు వారి స్వగృహం ఉప్పల్లో మంగళవారం అభినందన సభను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా హాజరైన మిత్రులు, శ్రేయోభిలాషులు, బంధువులు,గ్రామస్తులు, అతడిని అభినందించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు తమ ప్రసంగంలో కర్ణాకర్ కుటుంబ పరిస్థితుల నేపథ్యం,తాను ఏకాగ్రతతో వృత్తి నిబద్ధత నైపుణ్యంతో ఉన్నత స్థితిని సాధించడం పట్ల హర్షాతిరేఖాలు వ్యక్తపరిచారు.ఉప్పల్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దేశిని హరిశంకర్ తన ప్రసంగంలో. .కర్ణాకర్ వ్యక్తిత్వం వృత్తి నిబద్ధత కుటుంబం స్నేహితులు గ్రామం పట్ల అతడు చూపే ఆదరణ దయ కరుణ అనే అంశాలను ఆహుతులకు కనులకు కట్టినట్లు విశదీకరించారు హరి శంకర్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ కొంతమంది మనుషులు విజయం సాధిస్తారు...కానీ కొంతమంది తమ విజయంతో పాటు తమ విలువలను కూడా వెంట తీసుకెళ్తారు.కొంతమంది ఉన్నత పదవులను అందుకుంటారు... కానీ కొంతమంది ఉన్నత పదవిని అలంకరించడమే కాకుండా, ఆ పదవికి గౌరవాన్ని తీసుకొస్తారు ఐపీఎస్ సాధించిన కర్ణాకర్ ను చూస్తూ, ఆయన మాటలు వింటూ ఉన్నప్పుడు నాకు ఒక విషయం చాలా స్పష్టంగా అనిపించింది విజయం ఆయనలో గర్వాన్ని పెంచలేదు; బాధ్యతను పెంచింది పదవి ఆయనలో దూరాన్ని పెంచలేదు; మరింత వినయాన్ని పెంచింది.అదే నిజమైన వ్యక్తిత్వానికి గుర్తు. నిబద్ధత --- ఆయన విజయానికి పునాది జీవితంలో ఎక్కడికి చేరుకున్నామన్నది మాత్రమే విజయం కాదు. ఎలా చేరుకున్నామన్నదే అసలైన విజయం.పుల్ల కరుణాకర్ ప్రయాణాన్ని చూస్తే క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమ, లక్ష్యంపై ఏకాగ్రత ఆయన విజయానికి బలమైన పునాదులుగా కనిపిస్తాయి.ఖాకీ యూనిఫాం ఒక ఉద్యోగానికి గుర్తు మాత్రమే కాదు. అది బాధ్యతకు, ధైర్యానికి, న్యాయానికి, ప్రజాసేవకు ప్రతీక.ఆ బాధ్యతను



స్వీకరించే స్థాయికి చేరుకోవడానికి ఆయన చేసిన ప్రయాణం యువతకు ఒక గొప్ప సందేశం:పరిస్థితులు మన భవిష్యత్తును నిర్ణయించవు; మన నిబద్ధతే నిర్ణయిస్తుంది." నిజాయితీ --- ఆయన వ్యక్తిత్వానికి వెన్నెముకపదవి వచ్చిన తర్వాత నిజాయితీగా ఉండటం ఒక విషయం. పదవి రాకముందు కూడా విలువలను కాపాడుకుంటూ ముందుకు సాగడం మరో విషయం.నిజాయితీ అనేది మాటల్లో చెప్పే గుణం కాదు; అది మన ప్రవర్తనలో కనిపించే నిశ్శబ్ద శక్తి.ఆయన మాటల్లోనూ, వ్యవహారశైలిలోనూ కనిపించిన ఆ సహజత్వం, నిష్కపటత నిజాయితీ ఇంకా మనిషి గొప్ప ఆస్తిగానే ఉందని గుర్తు చేస్తుంది.క్రమశిక్షణ --- విజయాన్ని నిలబెట్టే శక్తిప్రతిభ మనల్ని ఒక స్థాయికి తీసుకెళ్లవచ్చు. కానీ క్రమశిక్షణ మాత్రమే మనల్ని అక్కడ నిలబెడుతుంది.ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకోవడం సులభం. దాని కోసం ప్రతిరోజూ మనల్ని మనం నియంత్రించుకోవడం కష్టం.ఆ క్రమశిక్షణే ఒక సాధారణ యువకుడిని ఉన్నత స్థాయి అధికారిగా తీర్చిదిద్దుతుంది.అందుకే ఆయన జీవితం యువతకు చెబుతున్న సందేశం ఒక్కటే.. "కలలు కనండి... కానీ ఆ కలలకు క్రమశిక్షణను జోడించండి." పదవిలో ఉన్నా... మనసులో మాత్రం అదే మనిషి ఉన్నత పదవిలోకి వెళ్లిన తర్వాత చాలామంది తమ చుట్టూ ఒక దూరాన్ని సృష్టించుకుంటారు. కానీ నిజమైన గొప్పతనం ఏమిటంటే ఎత్తుకు ఎదిగినా, మనుషులకు దగ్గరగా ఉండటం.ఆయన మాటల్లో కనిపించిన ఆ సరళత, ఆప్యాయత, సహజత్వం...విజయం మనిషిని మార్చకూడదని, విజయం మనలోని మంచితనాన్ని మరింత వెలుగులోకి తీసుకురావాలని చెప్పినట్లుగా అనిపించింది.కుటుంబం పట్ల ప్రేమ --- మనిషితనానికి అద్దం ఒక వ్యక్తి ఎంత పెద్ద అధికారి అన్నది అతని పదవి చెబుతుంది. కానీ అతను ఎంత గొప్ప మనిషో అతను తన కుటుంబాన్ని ఎలా చూస్తాడో చెబుతుంది. తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞత, కుటుంబ సభ్యుల పట్ల ప్రేమ, వారి త్యాగాలను గుర్తుంచుకోవడం ఇవి కేవలం కుటుంబ విలువలు కాదు; ఇవే ఒక మనిషి వ్యక్తిత్వానికి మూలస్తంభాలు. తన ఎదుగుదల వెనుక నిలిచిన కుటుంబాన్ని గుర్తు చేసుకోవడం ద్వారా ఆయన ఒక గొప్ప సత్యాన్ని గుర్తుచేశారు: "మన విజయానికి మనం ఒక్కరమే కారణం కాదు; మన వెనుక నిలిచిన ఎన్నో హృదయాల ఆశీర్వాదం ఉంటుంది." స్నేహితుల పట్ల ఆప్యాయత --- విజయాన్ని పంచుకునే హృదయం కాలం మారుతుంది. పదవులు మారుతాయి. పరిస్థితులు మారుతాయి. కానీ నిజమైన స్నేహం మారకూడదు. తన జీవిత ప్రయాణంలో తనతో నడిచిన స్నేహితులను గుర్తుంచుకోవడం, వారితో ఆప్యాయంగా మెలగడం ఆయనలోని మానవత్వానికి నిదర్శనం. విజయాన్ని ఒంటరిగా అనుభవించకుండా, తన విజయాన్ని తనవారితో పంచుకోవాలనే మనసు నిజమైన గొప్పతనం. సొంత గ్రామం పట్ల అనుబంధం --- మూలాలను మరచిపోని మనసు ఎంత ఎత్తుకు ఎదిగినా మనం ఎక్కడి నుంచి వచ్చామో మరచిపోకపోవడం గొప్ప లక్షణం. సొంత ఊరు మన జన్మస్థలం మాత్రమే కాదు అది మన బాల్యం, మన జ్ఞాపకాలు, మన మొదటి అడుగులు, మనకు విలువలు నేర్పిన నేల. ఆ గ్రామం గురించి ప్రేమతో మాట్లాడే వ్యక్తి తన మూలాలను గౌరవిస్తున్నాడని అర్థం. ఆకాశాన్ని తాకాలంటే ముందుగా మన పాదాలు నేలను తాకుతూ ఉండాలి. ఆ నేలతో తన అనుబంధాన్ని నిలబెట్టుకోవడం కరుణాకర్ వ్యక్తిత్వంలోని మరో గొప్ప అను బంధాన్ని స్థితప్రజ్ఞత --- విజయాన్ని తలకెక్కించుకోని మనసు ఉప్పల్లో జరిగిన అభినందన సభ సందర్భంగా తన మనసులో బలంగా నిలిచిన భావన ఇదే అంటూ---ఆయనలో ఒక స్థితప్రజ్ఞుని లక్షణాలు కనిపించాయి.భగవద్గీతలో చెప్పిన స్థితప్రజ్ఞత అంటే భావోద్వేగాలు లేని మనిషిగా మారడం కాదు. సుఖం వచ్చినప్పుడు పొంగిపోకుండా, కష్టం వచ్చినప్పుడు కుంగిపోకుండా, విజయం వచ్చినప్పుడు అహంకరించకుండా, బాధ్యత వచ్చినప్పుడు వెనుకడుగు వేయకుండా తన ధర్మాన్ని ప్రశాంతంగా నిర్వర్తించే స్థిరమైన మనస్సు.ఆ లక్షణాలే ఆయన మాటల్లోనూ, వ్యవహారంలోనూ నాకు కనిపించాయి.పదవి వచ్చింది --- వినయం తగ్గలేదు.విజయం వచ్చింది --- మూలాలు మరువలేదు.గౌరవం వచ్చింది --- సింప్లిసిటీ పోయలేదు.బాధ్యత పెరిగింది --- మనుషుల పట్ల ప్రేమ తగ్గలేదు.ఇదే నిజమైన స్థితప్రజ్ఞతకు దగ్గరైన జీవన విధానం.ఒక అధికారి మాత్రమే కాదు... ఒక స్ఫూర్తి కరుణాకర్ ప్రయాణాన్ని ఒక వ్యక్తి విజయగాథగా మాత్రమే చూడకూడదు.ఇది ప్రతి గ్రామీణ యువకుడికి ఒక సందేశం కావాలని ఆకాంక్షించారు"నీ ప్రారంభం చిన్నదైనా పరవాలేదు...నీ కల పెద్దదిగా ఉండాలి.నీ పరిస్థితులు కఠినమైనా పరవాలేదు...నీ సంకల్పం బలంగా ఉండాలి.నువ్వు ఎంత ఎత్తుకు ఎదిగినా...నీ మనసు మాత్రం నేలపై ఉండాలి అంటూ ఉద్బోధించారు."ఆయనలో పోలీస్ అధికారిని మాత్రమే మాత్రమే చూడలేదు.నిబద్ధతను చూశాను.నిజాయితీని చూశాను.క్రమశిక్షణను చూశాను.వినయాన్ని చూశాను.ప్రేమను చూశాను.కరుణను చూశాను.కుటుంబ విలువలను చూశాను.స్నేహాన్ని చూశాను.సొంత నేలపై మమకారాన్ని చూశాను.అన్నింటికంటే మించి... ఒక స్థిరమైన మనసును చూశాను అంటూ,ఒక మనిషి గొప్పతనం అతని హోదాలో ఉండదు.అతని చుట్టూ ఎంతమంది నిలబడుతున్నారన్నదిలో కూడా ఉండదు.అతను ఎదిగిన తర్వాత కూడా తనను తాను ఎంత సరళంగా, నిజాయితీగా, మానవత్వంతో నిలబెట్టుకున్నాడన్నదే అసలైన గొప్పతనం.ఆ దృష్టిలో చూస్తే---ఆయన సాధించిన విజయం ఒక వ్యక్తి విజయం మాత్రమే కాదు;తనను తీర్చిదిద్దిన తల్లిదండ్రులకు గౌరవం,తనతో నడిచిన స్నేహితులకు స్ఫూర్తి,తన గ్రామానికి గర్వకారణం,యువతకు మార్గదర్శకం.పదవి ఆయనకు గౌరవాన్ని ఇవ్వలేదు...ఆయన వ్యక్తిత్వమే ఆ పదవికి గౌరవాన్ని తీసుకొచ్చింది...మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలనే ఒక గొప్ప వ్యక్తిత్వాన్ని తనలో నేను గమనించాను అంటూ ముగించారు. అభినందన సభలో కుటుంబ సభ్యులు బంధుమిత్రులు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పూర్వ పాఠశాల కళాశాల విద్యార్థి మిత్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆడ బిడ్డకు అండగా ఉంటాం.. రంగాపురంలో మహిళా సంక్షేమ శాఖ భరోసా



**మొగుళ్లపల్లి, నేటిధాత్రి:** ఆడబిడ్డల రక్షణ, విద్య, ఆరోగ్యమే లక్ష్యంగా మొగుళ్లపల్లి మండలం రంగాపూర్ గ్రామంలో మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చైతన్య సదస్సు నిర్వహించారు.జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు, జిల్లా సంక్షేమ అధికారిణి సూచనలతో సూపర్ వైజర్ అరుణదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బేటీ బచావో బేటీ



పఢావో, పోక్సో చట్టం, బాల్య వివాహాల నివారణ, పోషణ మరియు సఖి కేంద్ర సేవలపై అవగాహన కల్పించారు.జెండర్ స్పెషలిస్ట్ అనూష మాట్లాడుతూ బాలికలకు చిన్ననాటి నుంచే పౌష్టికాహారం అందించడం ఎంతో అవసరమన్నారు. రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించేందుకు అంగన్ వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, 1098 చైల్డ్ హెల్ప్ లైన్, బాల్య వివాహాల నివారణపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సఖి కేంద్రం అడ్మిన్ గాయత్రి మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న ప్రతి మహిళకు సఖి కేంద్రం అండగా ఉంటుందన్నారు. వరకట్నం, గృహ హింస బాధితులకు 181 హెల్ప్ లైన్ ద్వారా 24 గంటలు సేవలు అందుబాటులో ఉంటాయని, సఖి కేంద్రంలో 5 రోజుల పాటు ఉచిత వసతి, వైద్య సహాయం, న్యాయ సహాయం, కౌన్సెలింగ్, పోలీస్ సహాయం అందిస్తామని తెలిపారు.అంగన్ వాడీ కేంద్రాలు కేవలం పోషకాహార కేంద్రాలుగా కాకుండా బాలికల హక్కులు, విద్య, భద్రత, సాధికారతకు మార్గదర్శక కేంద్రాలుగా పనిచేయాలని అన్నారు. చట్టం ముందు అందరూ సమానమని, బాల్య వివాహాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని, పోక్సో చట్టం, వయోవృద్ధుల చట్టం, 14567 హెల్ప్ లైన్ గురించి వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలని, బాల్య వివాహాల నివారణకు గ్రామస్థులంతా బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శి, అంగన్ వాడీ టీచర్లు, విద్యార్థులు, గర్భిణీలు, బాలింతలు, బాలికలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

**పరకాల, నేటిధాత్రి:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలుగు విభాగం,ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.సంతోష్‌కుమార్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ సామాన్య ప్రజల గొడవను తన గొడవగా భావించి పెన్నునే గన్నుగా మలిచి ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచిన మహోన్నత ప్రజాకవి కాళోజీ అని కొనియాడారు. తెలుగు విభాగం అధ్యాపకులు రేణు ఈశ్వరయ్య,వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎన్.మల్లయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.రామకృష్ణ, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎ.అశోక్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అసోసియేట్ ప్రొఫెసర్ అన్నెం శ్రీనివాస్‌రెడ్డి కాళోజీ సేవలు, తెలంగాణ భాష కోసం ఆయన చేసిన కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి.విజయ్‌పాల్‌రెడ్డి, బి.మహేందర్‌రావు, టి.భీమ్రావు, టి.కల్పన, జి.పావని, ఆడెపు రమేష్, ఎం.సమ్మయ్య, కె.జగదీశ్వర్, ఎస్.రాజశ్రీ, లైబ్రేరియన్ జి.రాజేశ్వర్‌కుమార్, డి.సంజయ్‌కుమార్, జి.స్వప్న, ఆరుట్ల అలేఖ్య, డి.సతీష్‌తో మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## మంతన్ స్కూల్ బస్సు ఫైర్ యాక్సిడెంట్‌పై తల్లిదండ్రుల ధర్నా.

**భద్రతా చర్యలపై ఆగ్రహం.. యాజమాన్యం తీరుపై మండిపాటు.**

**పాటన్‌చేరు, నేటిధాత్రి:** పిల్లల భద్రతపై నిర్లక్ష్యం వద్దంటూ తల్లిదండ్రుల డిమాండ్ చేస్తూ మంగళవారం స్కూల్ బస్సులో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల భద్రతకు గ్యారంటీ ఎక్కడ అంటు బుధవారం పాఠశాలకు చేరుకొని తల్లిదండ్రులు యాజమాన్యం తీరుపై ధర్నా నిర్వహించారు. ఈ ఘటనతో పాటు గతంలో జరిగిన ఘటనను కూడా సీరియస్‌గా తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్కూల్ యాజమాన్యాన్ని నిలదీశారు.నిన్న కొల్లూరు లో జరిగిన స్కూల్ బస్సు అగ్నిప్రమాద ఘటనతో పాటు గతంలో చోటుచేసుకున్న ఘటనపై తల్లిదండ్రులు సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. పిల్లల భద్రత విషయంలో స్కూల్ యాజమాన్యం మరింత బాధ్యతగా వ్యవహరించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు.





## గణపతి నవరాత్రి ఉత్సవాలకు తగు జాగ్రత్తలు పాటించాలి

**హుజురాబాద్ ఏసిపి మాధవి...**

**వీణవంక, నేటిధాత్రి:** ఈనెల 14న గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎలాంటి వాంఛనీయ ఘటనలు జరగకుండా ఆ సాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హుజురాబాద్ ఏసిపి మాధవి హాజరయ్యారు, అనంతరం వారు మాట్లాడుతూ... గణేష్ మండపాల నిర్వాహకులు, సర్పంచులు గ్రామ ప్రజలు వినాయక చవితి పండుగ పై పలు సూచనలు చేశారు. మండపాల దగ్గర తగు చర్యలు పాటించాలని, డీజే సౌండ్ బాక్సులు, ట్రాఫిక్ నియంత్రణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని విద్యుత్ భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీసుల ఇచ్చిన సూచనలు పాటిస్తూ, కుల మతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, ఉపసర్పంచ్లు, వార్డ్ సభ్యులు, నాయకులు, గణేష్ మండప నిర్వాహకులు,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్‌లో ధ్రువపత్రాల పరిశీలన వేగవంతం చేయాలి

**నిర్దేశిత గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలి: కలెక్టర్ కుమార్ దీపక్....**

**జైపూర్, నేటిధాత్రి:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్--2026)లో మ్యాపింగ్ కాని,అనమలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి వారు సమర్పిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు.బుధవారం జైపూర్ మండలం నర్వ గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసుల జారీ,విచారణ ప్రక్రియలను కలెక్టర్ పరిశీలించారు.అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), బూత్ స్థాయి ఏజెంట్ల సమన్వయంతో ఓటర్లకు అవగాహన కల్పించి, అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.అనంతరం టేకుమట్ల గ్రామంలో తహసీల్దార్ వనజారెడ్డి,ఎంపీడీవో శ్రీపతి బాపూరావుతో కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు.



**పాఠశాలలో సదుపాయాలు కల్పించాలి....** కుందారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించి తరగతి గదులు,పరిసరాలు,మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు.విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు అనుగుణంగా పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించాలని సూచించారు.మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహారాన్ని సకాలంలో అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించి విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఇసుక సరఫరా పారదర్శకంగా ఉండాలి...** వేలాల గ్రామంలోని ఇసుక రీచ్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఎస్ఎస్ఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా నిర్వహిస్తున్న ఇసుక సరఫరా ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఇసుకను పారదర్శకంగా,అధికారికంగా సరఫరా చేస్తున్నామని, ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వినియోగదారులకు బుకింగ్ ప్రకారం నిర్ణీత గడువులోగా ఇసుక అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఇసుక అక్రమ రవాణా,అక్రమ నిల్వలపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని,నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో కాలేజీ జయంతి వేడుకలు.



**చిట్యాల, నేటిధాత్రి:** చిట్యాల మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాల /కళాశాలలో తెలంగాణ రాష్ట్ర భాషా దినోత్సవం సందర్భంగా డాక్టర్ కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాలవేసి జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ మేకుల రమేష్ మాట్లాడుతూ కాళోజి నారాయణ రావు తెలంగాణ రాష్ట్రానికి ఒక అద్భుతమైన అభ్యుదయమైన కవి అని ఆయన జీవితాంతం ప్రజలతోనే ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని ఆయన రచనలు యువత మదిలో ఉత్సాహాన్ని ఉద్యమ శక్తిని నింపిందని తెలంగాణ రావడానికి ఆయన ముఖ్య కారకులని అన్నారు తెలంగాణ యాస భాష లలో తెలంగాణ ఉద్యమం మొదటి స్థానంలో నిలిచిందని మనది బడి పలుకుల భాష కాదని పలుకు పలుకుబడుల భాష అని నిజాం పరిపాలనలో రజాకార్లకు భయపడకుండా నా తెలంగాణ ఉద్యమమే నా గొడవ అని ఎదురు తిరిగిన గొప్ప మహనీయుడని అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నీలం రవీందర్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వాసాల వెంకటేశ్వర్లు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ భాషా సంస్కృతులకు పట్టంకట్టిన ప్రజాకవి కాళోజీలి

**నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్...**

**నర్సంపేట, నేటిధాత్రి:** తెలంగాణ రాష్ట్ర భాషా సంస్కృతికి పట్టం కట్టిన మహనీయుడు ప్రజాకవి, పద్మవిభూషణ్ శ్రీ కాళోజీ నారాయణరావు అని నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ కొనియాడారు. బుధవారం కాళోజీ జయంతిని పురస్కరించుకుని నర్సంపేట మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రజల సమస్యలను, ఆకాంక్షలను ప్రజా భాషలోనే తన కవిత్వం మరియు రచనల ద్వారా వెలుగులోకి తీసుకొచ్చిన యుగకర్త కాళోజీ అని పేర్కొన్నారు. తన కలాన్ని సామాజిక చైతన్యానికి సాధనంగా మలిచి అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, మానవ హక్కుల కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు.తెలంగాణ భాష కేవలం మన మాట తీరు మాత్రమే కాదని, అది మన సంస్కృతి, మన జీవన విధానం, మన ఆత్మగౌరవానికి ప్రతీక అని స్పష్టం చేశారు. మన భాషకు, యాసకు సాహిత్య గౌరవాన్ని తీసుకురావడంలో కాళోజీ పాత్ర ఎంతో విశిష్టమైనదని చెప్పారు. కాళోజీ ప్రజా చైతన్య స్ఫూర్తిని, ఆయన ఆశయాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్, మున్సిపల్ ఏఈ చంద్రమౌళి, కౌన్సిలర్లు మాదాసి రవి, ఏపూరి శ్రీనివాస్ రెడ్డి, పున్నం నరసింహారెడ్డి, సలావుద్దీన్ అయూబ్ ఖాన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**త్రాగునీటి కేంద్రాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్....** మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపల్లి రోడ్డు న్యూ ప్రతాపరుద్ర ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కీర్తిశేషులు వైనాల సాంబయ్య, వైనాల రాజు జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన ఉచిత త్రాగునీటి కేంద్రాన్ని నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ ప్రారంభం చేశారు.ఈ కార్యక్రమంలో న్యూ ప్రతాపరుద్ర ఆటో యూనియన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవం నిర్వహణ

**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. తెలంగాణ మాండలిక భాషకు, సాహిత్యానికి విశిష్ట గుర్తింపు తెచ్చిన ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ... తెలంగాణ భాష కేవలం మాండలికం మాత్రమే కాదని, అది ప్రజల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు మరియు భావోద్వేగాలను ప్రతిబింబించే సజీవ భాష అని కొనియాడారు. విద్యార్థులు మాతృభాషను గౌరవిస్తూ, తెలంగాణ భాషలోని ప్రత్యేక పదజాలాన్ని, జానపద సంపదను పరిరక్షించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు తెలంగాణ సాహిత్య వైభవాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.తెలుగు విభాగాధిపతి శ్రీమతి రజిత మాట్లాడుతూ... కాళోజీ తన రచనలతో ప్రజల్లో చైతన్యాన్ని రగిలించి అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యాన్ని ఇచ్చారని తెలిపారు. తెలంగాణ భాషలోని సరళత, సామెతలు, జాతీయాలు, జానపద గేయాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ సత్యనారాయణ, ఎగ్జామ్స్ కంట్రోలర్ కమలాకర్, అధ్యాపకులు డాక్టర్ రాంబాబు, డాక్టర్ సంధ్య, డాక్టర్ భద్రు, డాక్టర్ రాజీరు, డాక్టర్ రుద్రాణి, డాక్టర్ గాయత్రి, గ్లోరీ, మాధవి, ప్రకాశం, అధ్యాపక బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.



## మృత్యువుతో పోరాడి కోలుకున్న స్పందనను పరామర్శించిన పెరుక సంఘం

**శ్రీరాంపూర్, నేటిధాత్రి:** అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, కోమాలోకి వెళ్లి చికిత్స అనంతరం కోలుకున్న మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన లగిశెట్టి స్పందనను బుధవారం పెద్దపల్లి జిల్లా పెరుక సంఘం నాయకులు పరామర్శించారు.మే 31న చికాగోలోని మెట్రో స్టేషన్‌పై నుంచి సుమారు 25 అడుగుల ఎత్తు నుంచి పడిపోవడంతో స్పందన తీవ్రంగా గాయపడింది. చికిత్స సమయంలో కోమాలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆ సమయంలో పెరుక సంఘం స్పందన కుటుంబానికి అండగా నిలిచి రూ. 1,51,200 ఆర్థిక సహాయం అందజేసింది.తాజాగా చికిత్స అనంతరం స్పందన స్వస్థలానికి చేరుకోవడంతో పెరుక సంఘం నాయకులు ఆమెను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.త్వరగా పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో పెరుక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి,పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు దుండె మల్లేశం, రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడు పోతరాజుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**27న జిల్లాల్లో ఆకర్షణీయ కార్యక్రమాలు చేపట్టాలి...**

**రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్...**

**మంచిర్యాల, నేటిధాత్రి:** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27న జిల్లాల్లో వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ అధికారులను ఆదేశించారు.బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు,అదనపు కలెక్టర్లు, అటవీ,ఇతర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా వాణి ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించి,వివిధ శాఖల సమన్వయంతో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సూచించారు.ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకొని ఆకర్షణీయమైన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.యువతలో పర్యాటక రంగంపై ఆసక్తిని పెంపొందించేందుకు పర్యాటక ప్రాంతాల ప్రచారం,అభివృద్ధిలో ఆసక్తి ఉన్న యువతను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. యువ టూరిజం క్లబ్‌ల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించే కార్యక్రమాలను వేడుకల్లో నిర్వహించాలని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 142 పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు,మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పర్యాటక ప్రాంతాల ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వినూత్న ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఫిల్మ్ టూరిజాన్ని ప్రోత్సహించాలని తెలిపారు.



**పురాతన మాన్యుస్క్రిప్ట్‌ల డిజిటలైజేషన్....** జ్ఞాన భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాల్లో అందుబాటులో ఉన్న పురాతన మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి డిజిటలైజేషన్ చేయాలని వాణి ప్రసాద్ సూచించారు.జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి దేవాలయాలు, మఠాలు,గ్రంథాలయాలు, విద్యాసంస్థలు,ఇతర సంస్థలు, వ్యక్తుల వద్ద ఉన్న మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి సమగ్ర జాబితా రూపొందించాలని తెలిపారు.జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక,సహజ పర్యాటక ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసి విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా మంచిర్యాల జిల్లాను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు.పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రచారం కల్పించి ప్రజలకు మరింత చేరువ చేస్తామని పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## టెట్‌లో మాస్ కాపీయింగ్‌పై సమగ్ర విచారణ జరపాలి

**నర్సంపేట, నేటిధాత్రి:** విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు నిర్వహించే టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడటం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని వరంగల్ జిల్లా ప్రైవేట్ టీచర్స్ యూనియన్ అధికార ప్రతినిధి, సామాజిక విశ్లేషకులు సింగనబోయిన శ్రీశైలం అన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో టెట్ పరీక్ష సందర్భంగా 10 మంది అభ్యర్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఘటన తీవ్రంగా ఖండించాల్సిన విషయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించేందుకు నిర్వహించే అర్హత పరీక్షలోనే అక్రమాలకు పాల్పడటం విద్యా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. అక్రమ మార్గాల్లో అర్హత సాధించే వ్యక్తులు ఉపాధ్యాయులుగా మారితే విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పించాల్సిన ఉపాధ్యాయ అభ్యర్థులే ఇలాంటి చర్యలకు పాల్పడటం బాధాకరమన్నారు.ఈ ఘటనపై కేవలం మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన అభ్యర్థులపైనే కాకుండా, వారికి సహకరించిన వ్యక్తులు, దీని వెనుక ఉన్న వారిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను కాపాడేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని శ్రీశైలం కోరారు.



## ఉచిత వైద్య శిబిరం



**శ్రీరాంపూర్, నేటిధాత్రి:** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 29వ డివిజన్ కార్పొరేటర్ బండారి సుధాకర్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ వాటర్ ట్యాంక్ ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం ఏర్పాటుచేసిన శిబిరంలో స్థానిక ప్రజలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ బండారి సుధాకర్ మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంచిర్యాల్ మేయర్ ధర్ని మధు హాజరయ్యారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన కార్పొరేటర్ కు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## గణపురంలో ఘనంగాపోచమ్మ తల్లి బోనాల పండుగ వేడుకలు



**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండలం గ్రామంలో అంగరంగ వైభవంగా శ్రావణమాసం చివరి బుధవారంలో పోచమ్మ తల్లి బోనాల పండుగ లో డీజే డప్పు సప్పులతో శివశక్తులతో నృత్యం చేసుకుంటూ మేకపోతుల కోళ్ల తో వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు సుఖశాంతులతో చల్లంగా ఉండాలని ఆశిస్తూ పిల్ల పాపలతో కుటుంబాల సమేతంగా పోచమ్మ తల్లి బోనాల పండుగ వేడుకలలో పాల్గొన్నారు.పోచమ్మ తల్లి ఆలయ ప్రధాన పూజారులు చిలుమోజి ఉమాదేవి శంకర చారి రాధిక రాజు చారి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.కుల పెద్ద మనుషులు 8 మంది ఆధ్వర్యంలో గ్రామస్తులు మహిళలు పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పురాతన గ్రంథాల గుర్తింపునకు చర్యలు



**తాళపత్ర గ్రంథాలు,అరుదైన మాన్యుస్క్రిప్ట్‌లను భద్రపరచాలి....**

**జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య....**

**మంచిర్యాల, నేటిధాత్రి:** జ్ఞాన భారతి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో అందుబాటులో ఉన్న పురాతన గ్రంథాలు,తాళపత్ర గ్రంథాలు, అరుదైన మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి భద్రపరిచేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులను ఆదేశించారు.బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు,గ్రంథాలయాలు, విద్యాసంస్థలు,దేవాలయాలు, మఠాలు, పరిశోధనా సంస్థలతో పాటు వ్యక్తుల వద్ద ఉన్న పురాతన గ్రంథాలు,తాళపత్ర గ్రంథాలు,చారిత్రక ప్రాధాన్యత కలిగిన మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజల వద్ద ఉన్న అరుదైన గ్రంథాలు,పాత పత్రాలు,తాళపత్ర గ్రంథాలకు సంబంధించిన సమాచారాన్ని అధికారులకు అందించేలా ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు.గుర్తించిన మాన్యుస్క్రిప్ట్‌లను శాస్త్రీయ పద్ధతుల్లో డిజిటలైజేషన్ చేసి, వాటి సమాచారాన్ని భద్రపరచడంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా కేంద్రీకృత ప్రదేశంలో భద్రపరచాలని సూచించారు.అలాగే కేంద్రీకృత డిజిటల్ డేటాబేస్‌లో నమోదు చేయాలని తెలిపారు.జిల్లా చరిత్ర,సంస్కృతి,సాహిత్యం, సంప్రదాయాలు,స్థానిక వారసత్వానికి సంబంధించిన విలువైన సమాచారాన్ని భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచేందుకు జ్ఞాన భారతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



- పర్మిషన్ ఉన్నా.. నిర్మాణానికి బ్రేక్!
- రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థలంలో ఇల్లు కట్టుకోనివ్వరా?
- మున్సిపల్ అనుమతి ఉన్నా అడుగడుగునా అవరోధాలా?
- మున్సిపల్ ఉద్యోగి తీరుపై బాధితుడి ఆవేదన
- 2013లో స్థలం కొనుగోలు.. రిజిస్ట్రేషన్ పూర్తి
- మున్సిపల్ అనుమతి తీసుకున్నా అడ్డంకులు.
- 'రోడ్డు స్థలం' అంటూ కొత్త వాదన.. 'కాగితాలు ఉన్నాయి' అంటూ మరో పేచీ
- బిల్ కలెక్టర్ హోదాలో ఉండి ఇదేం తీరు?

# బిల్ కలెక్టర్ అడ్డంకులేంటి?

## 'రోడ్డు' అంటూ అడ్డగింతలు.. 'కాగితాలు' అంటూ పేచీలు!

### ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం

వరంగల్, నేటిధాత్రి:
వరంగల్ మిల్స్ కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో సొంతంగా స్థలం కొనుగోలు చేసి.. రిజిస్ట్రేషన్ చేసుకుని.. ఇంటి నిర్మాణానికి మున్సిపల్ అనుమతి తీసుకున్నా ఇల్లు కట్టుకోలేని పరిస్థితి ఎదురైతే బాధితుడు ఎవరిని ఆశ్రయించాలి? పక్కనే నివసించే మున్సిపల్ ఉద్యోగి, ఆయన కుటుంబ సభ్యులు కలిసి నిర్మాణానికి అడ్డంకులు సృష్టిస్తున్నారనే ఆరోపణలు ఇప్పుడు వరంగల్‌లో చర్చనీయాంశంగా మారాయి.
వివరాల్లోకి వెళితే.. ఓ వ్యక్తి 2013లో ఇంటి నిర్మాణం కోసం స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు సమాచారం. అనంతరం సంబంధిత ప్రక్రియ పూర్తి చేసి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఇంటి నిర్మాణానికి అనుమతి కూడా పొందినట్లు బాధితుడు చెబుతున్నాడు. ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సిద్ధమైన సమయంలో పక్కనే నివసించే కుటుంబం నుంచి అభ్యంతరాలు మొదలయ్యాయని ఆరోపిస్తున్నాడు.

#### రోజుకో వాదనతో వేధింపులు?

స్థలం తమదేనని కాకుండా.. అది రోడ్డు మార్గమని ఒకసారి, ఆ స్థలానికి సంబంధించిన కాగితాలు తమ వద్ద ఉన్నాయని మరోసారి చెబుతూ నిర్మాణ పనులను అడ్డుకుంటున్నారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. మున్సిపల్ ఉద్యోగిగా పనిచేస్తున్న వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి తరచూ అడ్డంకులు సృష్టిస్తున్నారని వాపోతున్నాడు.

#### మున్సిపల్ ఉద్యోగి అయితే.. ఇదేనా తీరు?

పక్కింటి వ్యక్తి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్నట్లు బాధితుడు పేర్కొంటున్నాడు. ప్రజలకు సేవ చేయాల్సిన మున్సిపల్ ఉద్యోగి.. వ్యక్తిగత స్థల వివాదంలో జోక్యం చేసుకుని నిర్మాణ పనులను అడ్డుకోవడం సమంజసమేనా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
స్థలం రోడ్డు మార్గంలో ఉంటే సంబంధిత రికార్డుల్లో ఏముంది? స్థలానికి సంబంధించిన హక్కులు, హద్దులు, రహదారి వివరాలపై అధికారిక రికార్డులు ఏమి చెబుతున్నాయి? మున్సిపల్ అనుమతి ఇచ్చే సమయంలో అధికారులు ఏ అంశాలను పరిశీలించారు? అన్నది స్పష్టం కావాల్సి ఉంది.

#### ఇల్లు అమ్మకానికీ సైతం తప్పుడు ప్రచారం?

ఇదే ప్రాంతంలో మరో కుటుంబం తమ ఇంటిని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనూ సమస్యలు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఆ ఇంటి స్థలం వివాదంలో ఉందని, అక్కడ ఇల్లు నిర్మించారని అంటూ సదరు బిల్ కలెక్టర్ అతని కుటుంబ సభ్యులు తప్పుడు ప్రచారం చేయడంతో కొనుగోలుదారులు వెనకడుగు వేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. బిల్ కలెక్టర్ కుటుంబానికి చెందిన ఇళ్లు మాత్రమే ఆ ప్రాంతంలో ఉండాలి కానీ.. ఇతరులు అక్కడ నివాసం ఉండకూడదన్న ఉద్దేశంతోనే ఇలాంటి ప్రచారాలు చేస్తున్నారా? అని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

#### పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు?

తనను, తన కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ సంబంధిత వ్యక్తులపై ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మున్సిపల్ ఉద్యోగి హోదాలో ఉండి కూడా ఇలా అడ్డంకులు సృష్టిస్తున్నారన్న ఆరోపణలపై అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

#### ఉన్నతాధికారులకు ఫిర్యాదు?

తన స్థలంలో చట్టబద్ధంగా ఇల్లు నిర్మించుకునేందుకు అన్ని పత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలు, మున్సిపల్ అనుమతి ఉన్నప్పటికీ అడ్డంకులు ఎదురవుతున్నాయని బాధితుడు చెబుతున్నాడు. ఈ వ్యవహారంపై త్వరలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులను కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు. మున్సిపల్ ఉద్యోగి హోదాను అడ్డుపెట్టుకుని వ్యక్తిగత వివాదంలో జోక్యం చేసుకున్నారా?

#### ఎవరా బిల్ కలెక్టర్? ఏమిటా వ్యవహారం?

రిజిస్ట్రేషన్ పత్రాలు.. మున్సిపల్ నిర్మాణ అనుమతి ఉన్నప్పటికీ ఇల్లు నిర్మించుకోలేని పరిస్థితి ఎందుకు ఏర్పడింది? బాధితుడికి ఎదురవుతున్న ఇబ్బందుల వెనుక అసలు కారణమేంటి? మున్సిపల్ అధికారులు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అనే అంశాలపై పూర్తిస్థాయి వివరాలు త్వరలో మీ "నేటిధాత్రి" లో..

# ఘనంగా సేవలాల్ సేన 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## తండా డెవలప్మెంట్ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్.





హనుమకొండ జిల్లా నేటిధాత్రి:
సేవలాల్ సేన 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను హనుమకొండ జిల్లా అధ్యక్షతన కునూసోతూ మురళి నాయక్ ఆధ్వర్యంలో వేదిక ఏ ఆర్ కన్వెన్షన్ హాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత సేవలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు ప్రేమ్‌చంద్ నాయక్ సేవలాల్ సేన జెండాను ఆవిష్కరించారు.
అనంతరం ముఖ్య నాయకుల సమావేశంతో పాటు సేవాలాల్ సేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విద్యార్థులు, మేధావులు, కుల సంఘాల నాయకులు మరియు బంజారా జాతి సమాజ ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజన జనాభా గణనీయంగా ఉన్నప్పటికీ గిరిజనులకు మంత్రి పదవి లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. గిరిజన విద్యార్థులకు సంబంధించిన పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయడంతో పాటు గిరిజనుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో సేవలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుపతి నాయక్, సేవాలాల్ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షులు ఎస్పీ నాయక్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు మురళి నాయక్, వరంగల్ జిల్లా అధ్యక్షులు మోహన్ నాయక్, వరంగల్ విద్యార్థి సంఘం అధ్యక్షులు సుమన్ నాయక్, యూనివర్సిటీ స్టూడెంట్ లీడర్ మరియు ఎమ్మెల్సీ అభ్యర్థి రాజు నాయక్, సేవలాల్ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షులు గుగులోత్ సంతోష్ నాయక్, రిటైర్డ్ ఆయుర్వేదిక్ డాక్టర్ చందు నాయక్, తదితరులు తెలంగాణ ఆకాంక్ష వేదిక నరోత్తపు సూరి ,వియంసి కళాశాల చైర్మన్ రమేష్ నాయక్ మాజీ జెడ్పిటిసి. సత్యవతి బిక్షపతి నాయక్, భద్ర నాయక్, రాజు, అఖిల్, కునసోత్ ప్రవీణ్ నాయక్,తిరుపతి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సేవాలాల్ సేన 12వ వార్షికోత్సవం.



హనుమకొండ జిల్లా నేటిధాత్రి:
సేవాలాల్ సేన 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ గ్రంథాలయం ఎదురుగా సేవాధ్వజాన్ని ఘనంగా ఎగురవేశారు. సేవాలాల్ సేన హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సిద్ధూ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనే ధ్వజారోహణ చేశారు. అనంతరం సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయజయధ్వానాలతో సేవాలాల్ మహారాజ్‌ను స్మరించుకున్నారు.
బంజారా సంప్రదాయ చరిత్ర ప్రకారం 1739 ఫిబ్రవరి 15న జన్మించిన సంత్ సేవాలాల్ మహారాజ్ సత్యనిష్ఠ, ఐక్యత, క్రమశిక్షణ, సోదరభావం, సేవాభావాన్ని ప్రబోధించిన మహనీయుడిగా బంజారా సమాజం గౌరవిస్తోందని నిర్వాహకులు తెలిపారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవాన్ని కాపాడుతూ సన్మార్గంలో పయనించాలని ఆయన బోధించారని పేర్కొన్నారు.
బంజారా సంప్రదాయంలో సేవాధ్వజం శాంతి, పవిత్రత, సత్యం, ఐక్యతకు ప్రతీకగా భావిస్తారని తెలిపారు. యువత విద్యతోపాటు సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక బాధ్యతలను గుర్తించి సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు సింగ్‌లాల్, గుగులోత్ వీరమ్మ, అర్పితాబాయి, ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ సభ్యులు నూనావత్ జవహర్‌లాల్, భూక్య ఉషన్ నాయక్, లంబాడీ లైవ్ ఐక్యత సంయుక్త జిల్లా అధ్యక్షుడు లౌడియా రాజునాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ సంయుక్త వరంగల్ జిల్లా అధ్యక్షుడు లోక్ జగపతినాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ నాయక్, శ్రవణ్ నాయక్, సుధాకర్ నాయక్, గద్దర్ నాయక్, శ్రీనివాస్, రాము, ఈర్యానాయక్, అంగోత్ శ్రీనివాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధ విరమణ దిశగా సాగని చర్చలు!!



డెస్క్, నేటిధాత్రి:
రష్యా-ఉక్రెయిన్ మధ్య చాలా కాలంగా యుద్ధం కొనసాగుతూనే ఉంది. యుద్ధ విరమణకు అనేక దఫాలుగా చర్చలు జరిగినా ఏ ఒక్కటీ కొలిక్కిరాలేదు. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గంటపాటు ఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సంభాషణలో శాంతి చర్చకర్తలైన స్టీవ్ విట్కాఫ్, జారెడ్ కుష్నర్ రష్యా, ఉక్రెయిన్‌లో చేసిన సందర్శనల ఫలితాలను చర్చించారు. ట్రంప్ పుతిన్‌తో ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధానికి త్వరగా ముగింపు పలకాలని కోరారని, ఇది అమెరికా-రష్యా సంబంధాలను పూర్తిగా పునరుద్ధరించడానికి సహాయపడుతుందని క్రెమ్లిన్ తెలిపింది. ఈ సందర్భంగా పుతిన్, యూరప్ పట్ల రష్యాకు ఎలాంటి దురాశలు లేవని ట్రంప్‌కు హామీ ఇచ్చారు.
పుతిన్ విదేశీ వ్యవహారాల సలహాదారు యూరీ ఉషాకోవ్ మాట్లాడుతూ, పుతిన్-ట్రంప్ మధ్య జరిగిన గంటసేపటి సంభాషణ 'సంఘటితంగా, చాలా స్పష్టంగా' సాగిందని పేర్కొన్నారు. విట్కాఫ్, కుష్నర్ చేసిన సందర్శనల ఫలితాలను మాస్కో సానుకూలంగా చూస్తోందని చెప్పారు.
'డొనాల్డ్ ట్రంప్ యుద్ధాన్ని త్వరగా ముగించాలనే తలంపును స్పష్టంగా వ్యక్తం చేశారు. ఇది అమెరికా, రష్యా మధ్య సంబంధాలను పునరుద్ధరించడానికి అద్భుతమైన అవకాశాలను తెరవగలదు' అని ఉషాకోవ్ తెలిపారు.
'ఈ దృష్టిలో ఇది వాణిజ్య, ఆర్థిక సంబంధాలపై ప్రత్యేక ప్రభావం చూపుతుంది. రెండు దేశాలకు భారీ లాభాలను అందించగలదు. ట్రంప్ తన అధ్యక్ష పదవీకాలంలో ఒక ప్రగతి సాధించాలని ఆసక్తిగా ఉన్నారు. ఈ దృష్టికి పుతిన్ మద్దతు ఇచ్చారు' అని పేర్కొన్నారు.
ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్, పుతిన్ మధ్య జరిగిన ఈ సంభాషణలో యూరోపియన్ దేశాల పట్ల రష్యా ఉద్దేశాల గురించి కూడా చర్చ జరిగింది. 'యూరప్ పట్ల మాకు ఎలాంటి దురాశలు లేవు' అని ఉషాకోవ్ స్పష్టం చేశారు.
ఈ ఫోన్ సంభాషణపై వైట్‌హౌస్ లేదా అమెరికా అధ్యక్షుడి నుంచి వెంటనే ఎలాంటి స్పందన రాలేదు. అమెరికా శాంతి చర్చకర్తలు జారెడ్ కుష్నర్, స్టీవ్ విట్కాఫ్ మాస్కో, కీవ్‌లలో పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలొదిమిర్ జెలెన్స్కీతో వేర్వేరుగా చర్చలు జరిపారు.
అయితే, ఈ సమావేశాలు యుద్ధాన్ని ముగించే దిశగా గణనీయమైన ప్రగతి సాధించలేకపోయాయి. రెండు దేశాలు తమ వాయు దాడులను కొనసాగించాయి. మంగళవారం స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, రష్యా కీవ్ నగరంపై డ్రోన్లు, క్షిపణులతో దాడి చేయడంతో ఇద్దరు వ్యక్తులు మరణించారు. మరోవైపు ఉక్రెయిన్ దాడిలో క్రిమియాలో ఇద్దరు వ్యక్తులు మరణించారు.
ఇటీవల నెలలుగా రష్యా, ఉక్రెయిన్ ఒకదానికొకటి ప్రతిదాడులు చేసుకుంటూ తమ వైమానిక యుద్ధాన్ని మరింత ఉధృతం చేశాయి. ఈ రోజు ముందుగా రష్యా అధ్యక్షుడి ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ మాట్లాడుతూ, 'రష్యా విజయానికి దగ్గరగా ఉంది. విజయం చాలా దగ్గరలోనే ఉంది' అని అభిప్రాయపడ్డారు.
మరోవైపు అంతర్జాతీయ రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, దౌత్య సంబంధాల నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య శుక్రవారం కీలక ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి.
ఇరు దేశాల మధ్య వాణిజ్య బంధం, అంతర్జాతీయ రవాణా ప్రాజెక్టులతో పాటు ముఖ్యంగా సుదీర్ఘంగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత ముగింపు పలకడమే లక్ష్యంగా ఈ భేటీ సాగనుందని రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పష్టం చేశారు.
11న ఢిల్లీ వేదికగా భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఆ సమావేశానికి ముందే మోదీ-పుతిన్ ఒకరినొకరు కలవబోతున్నారు. అనంతరం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.
యుద్ధ పరిష్కారం కోసం భారత్ చూపిస్తున్న నిబద్ధతను, చొరవను రష్యా మనస్ఫూర్తిగా స్వాగతిస్తోందని ఆయన వెల్లడించారు. అసలు తాము ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోలేదని, గతంలో మొదలైన ఈ వివాదానికి శాంతియుతంగా ముగింపు పలకడానికే రష్యా ప్రయత్నిస్తోందని చెప్పారు. రష్యా, ఉక్రెయిన్, అమెరికా మధ్య మళ్లీ శాంతి చర్చలు ప్రారంభమవుతాయని తాము ఆశిస్తున్నామని తెలిపారు. శాంతి పునరుద్ధరణ కోసం భారత్‌తో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు కూడా ఆహ్వానించదగినవేనని కొనియాడారు.
శాంతి ప్రక్రియ ముందుకు సాగాలంటే కేవలం తమ వైపు నుంచే కాకుండా ఉక్రెయిన్ నుంచి కూడా అంతే సుముఖత ఉండాలని రష్యా స్పష్టం చేసింది. కొన్ని ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌ను నిరంతరం రెచ్చగొడుతూ శాంతి చర్చలను పక్కదారి పట్టించేందుకు కుట్ర పన్నుతున్నాయని పెస్కోవ్ సంచలన ఆరోపణలు చేశారు. అయితే, ఆ విదేశీ కుట్రలు ఫలించ కుండా తాము అడ్డుకుంటామని, శాంతి మార్గంలోనే పరిష్కారాన్ని అన్వేషిస్తామని పునరుద్ఘాటించారు. మోదీ-పుతిన్ భేటీలోనైనా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు దారితీసే స్పష్టమైన చర్చలు జరగాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

# కేసీఆర్ ఇంటి శుద్ధిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి



- రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యాలయాలు, ఇళ్ల ముట్టడి
- డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ హెచ్చరిక

హనుమకొండ, నేటిధాత్రి:
దళిత నాయకులు వెళ్లిన ప్రదేశాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం దళితులను అవమానించడమేనని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మండిపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
దళిత స్పీకర్‌ను అవమానించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధును బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎస్సీ విభాగం నాయకులు కేసీఆర్ ఫార్మ్‌హౌస్‌కు వెళ్లారని తెలిపారు. అనంతరం ఆ ప్రదేశాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం అత్యంత అవమానకరమని విమర్శించారు. అంటరానితనాన్ని ప్రోత్సహించేలా వ్యవహరించిన వారితో పాటు ఈ చర్యను ప్రోత్సహించిన వారిపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా బీఆర్ఎస్‌లోని దళిత నాయకులు ఈ ఘటనపై స్పందించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌తో పాటు ఇతర దళిత నాయకులు ఈ ఘటనను ఖండించి దళితుల ఆత్మగౌరవం కోసం నిలబడాలని పిలుపునిచ్చారు.
దళితులను అవమానించే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యాలయాలు, నాయకుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాళ్లపెల్లి విజయ్, రమేష్, మహేష్ రాజు, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి వారం ప్రజల మధ్యనే ఉంటా



అమరావతి, నేటిధాత్రి:
సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు మూల మంత్రాలతోనే కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సచివాలయానికి పరిమితమై పనిచేయడం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య ఉంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపడమే అసలైన సుపరిపాలన అని, దానికోసం తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఉద్ఘాటించారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గంలోని మాచడవ పందువారిపేటలో బుధవారం నిర్వహించిన 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి వారం ప్రజల వద్దకే వస్తున్నానని, వారి బాగోగులు తెలుసుకుంటూ పాలన సాగిస్తున్నానని తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీన పేదల వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందిస్తూ వారి కష్టసుఖాలను తెలుసుకుంటున్నానని సీఎం గుర్తుచేశారు. అలాగే, ప్రతి నెలా మూడో శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో, నాలుగో శనివారం పీ4 (ప్రజలు, ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యం) కార్యక్రమంలో పాల్గొంటూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరిగితేనే సంపద సృష్టి జరుగుతుందని, తద్వారా ప్రజలంతా గౌరవంగా జీవించేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రతి నెలా 9వ తేదీన 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమం ద్వారా రైతులకు, యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని సీఎం తెలిపారు. భూమిపై యజమానులకు తిరుగులేని హక్కులు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత పాలకులు తమ ఐదేళ్ల పాలనలో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేశారని, రికార్డులను తారుమారు చేసి ఘోరాలు, నేరాలు, పాపాలు చేశారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో ప్రజల భూములను కాజేసేందుకు కుట్ర పన్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ప్రమాదకర చట్టాన్ని రద్దు చేసి ప్రజలకు భరోసా ఇచ్చిందని గుర్తుచేశారు. "రీసర్వే పేరుతో గత ప్రభుత్వం చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములపై కూడా తమ ఫొటోలు వేసుకున్నారు. సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకునే పిచ్చి ఏమిటో ఎవరికీ అర్థం కాలేదు. తమకు ఇష్టం లేని వ్యక్తుల భూములను, ఆస్తులను 22ఏ జాబితాలో చేర్చి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. అందుకే ఇప్పుడు పటిష్ఠమైన రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి, ఎక్కడా అవకతవకలకు తావులేకుండా బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, ఈ-కేవైసీ, క్యూఆర్ కోడ్ వంటి భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నాం"అని చంద్రబాబు వివరించారు.
భూమికి సంపూర్ణ భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ అజెండా అని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8,234 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి, 36 లక్షల మందికి రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు అందించామని తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన 8,582 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి మొత్తం 56 లక్షల పాస్ పుస్తకాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆటో మ్యూటేషన్ సేవలు అందుబాటులోకి తెచ్చామని, వారసత్వ భూముల విభజనలో స్టాంప్ డ్యూటీని కేవలం రూ.1000కి పరిమితం చేయడం ద్వారా 1.25 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చామని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి లక్షలాది మందికి ఊరట కల్పించామని అన్నారు. శెట్టిపల్లి కంగుంది, వట్టిచెరుకూరు, ముదినేపల్లి వంటి ప్రాంతాల్లో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న 244 కీలక భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించామని తెలిపారు. అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రాపురంలో బ్రిటిష్ కాలం నాటి (1908) 22ఏ(1) నిషేధిత భూముల సమస్యను కూడా పరిష్కరిస్తున్నామని, దీని ద్వారా 1410 మందికి చెందిన 56.37 ఎకరాల భూమికి విముక్తి కల్పిస్తున్నామని ప్రకటించారు. "గొడ్డలి పార్టీ తారుమారు చేసిన రికార్డులను ప్రక్షాళన చేసి భూ సమస్యలను కొలిక్కి తెస్తున్నాం" అని ఆయన వ్యాఖ్యానించారు. భూమి భద్రతతో పాటు నీటి భద్రతకు కూడా తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం అన్నారు. ఈ ఏడాది తీవ్రమైన ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ, గోదావరి నుంచి వెయ్యి టీఎంసీలకు పైగా నీరు సముద్రంలో వృథాగా కలిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం, రాజకీయ కక్షతో కాంట్రాక్టర్‌ను మార్చడం వల్లే పోలవరం డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయి ప్రాజెక్టు ఆలస్యమైందని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఢిల్లీలో సంజీవనిలా పనిచేసిందని, కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎక్కువ నిధులు తెచ్చుకోగలుగుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా, తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) రూ.240 కోట్ల వ్యయంతో చేపట్టిన గ్రిడ్ ఆధునీకరణ, 3-ఫేజ్ విద్యుత్ సరఫరా పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీశ్, స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

Printed, Published & owned by Katta Raghavender Rao, Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01.
Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail : netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999